
అమ్మ వైభవం..

అలంకార శోభితం

విద్యుద్దీప కాంతుల్లో మిరుమిట్లు గొలుపుతున్న ఆలయాలు.. రోజుకో అలంకరణలో అమ్మవారి దర్శనాలు.. వీనుల విందుగా జగన్మాత స్తోత్రాలు.. శరన్నవరాత్రులు అంతటా అద్వితీయ ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చాయి. భక్తుల సందర్శనతో ఆలయాలు కిక్కిరిసి కనిపిస్తున్నాయి.

– న్యూస్‌టుడే, నెల్లూరు (సాంస్కృతికం), బుచ్చి, సీతారామపురం


గజలక్ష్మి అలంకారంలో దర్గామిట్ట రాజరాజేశ్వరి


మీనాక్షీ దేవిగా అష్టలక్ష్మి అమ్మవారు




గాయత్రి దేవిగా కన్యకా పరమేశ్వరి


రాజరాజేశ్వరిదేవిగా జొన్నవాడ కామాక్షితాయి






సీతారామపురంలో మోహినీదేవిగా..

పట్టణ ప్రణాళిక అధికారులపై కొరడా

చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం



నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళికలో పనిచేసే పలువురు అధికారులు, ఉద్యోగులపై చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. 2020 ఫిబ్రవరి 18, 19 తేదీల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేయగా.. పలు అక్రమాలు వెలుగు చూశాయి. భవన నిర్మాణాల్లో అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. అక్రమాలకు పాల్పడిన 14 మందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వీరిలో కొందరు ఇతర ప్రాంతాలకు బదిలీ కాగా.. మరికొందరు స్థానికంగానే పని చేస్తున్నారు. ఇంకొందరు పదవీ విరమణ చేశారు. వారిలో డిప్యూటీ సిటీప్లానర్లు ఎ.మారుతి హరిప్రసాద్, జె.సూరజ్‌కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వి.రామలింగేశ్వరరెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారి డి.రమేష్‌బాబు, సూపర్‌వైజర్లు ఎంవీ శివప్రసాద్, బందెల హృదయరాజు, జె.గోవర్ధన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ తని శరత్‌బాబు, టీపీవో జేడీ ఆనంద్‌కుమార్, టీపీఎస్‌లు కె.ప్రకాష్‌బాబు, ఎం.దేవేంద్ర, సీనియర్ అసిస్టెంట్ డి.శేఖర్ బాబు ఉన్నారు. వీరితో పాటు రిజిస్టర్ల నిర్వహణలో అవకతవకలకు పాల్పడినట్లు పదవీ విరమణ చేసిన సూపరింటెండెంట్ సయ్యద్ ఆబిదా బేగం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బి.గుణశేఖర్‌పై కూడా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



రైతేరాజు కాకర.. సిరుల రుచి 6

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు



నెల్లూరు(లీగల్), న్యూస్‌టుడే: బాలిక(12)పై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో కొడవలూరు మండలం ఎల్లాయిపాళెం ఎన్టీఆర్ కాలనీకి చెందిన తాతలపూడి వెంకట రమణయ్యకు 20 ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎస్.సుమా సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. బాలిక తల్లి ఆమె భర్త నుంచి విడిపోయి నిందితుడు వెంకటరమణయ్యతో సహజీవనం చేస్తోంది. వీరిద్దరు కూలీపని చేసుకొని జీవనం సాగించేవారు. 2022 జులై 31న తల్లి కూలీ పనులకు వెళ్లి తిరిగి రాగా.. బాలిక కడుపు నొప్పితో బాధ పడుతోంది. తల్లి వివరాలు అడగ్గా.. అదేనెల 30న రాత్రి తల్లి నిద్రించిన తరువాత నిందితుడు వెంకట రమణయ్య బాలికను వేరే రూమ్‌లోకి తీసుకుపోయి లైంగిక దాడికి పాల్పడ్డాడు. గతంలో కొన్నిమార్లు లైంగిక దాడి జరిపి.. విషయాన్ని ఎవర్శికైనా చెబితే తల్లీకూతురును చంపేస్తానని బెదిరించాడు. సంఘటనపై బాలిక తల్లి కొడవలూరు పోలీసులకు అదేరోజు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువైంది. ప్రాసిక్యూషన్ తరపున ప్రత్యేక పీపీ శైలజారెడ్డి కేసు వాదించారు.

- కొన్నేళ్ల కిందట కందుకూరు మండలంలోని ఓ దంపతులు తమకు పుట్టిన బిడ్డను వారం రోజులు గడవక ముందే.. ఒంగోలుకు చెందిన మరొకరికి రూ. 50 వేలకు విక్రయించారు. ఆ విషయాన్ని గుర్తించిన ఐసీడీఎస్ అధికారులు విచారించగా.. అసలు విషయం వెలుగు చూసింది. వెంటనే పాపను తీసుకువచ్చి శిశుగృహలో ఉంచారు. ఇద్దరు దంపతులకు బాధలు తప్పలేదు. వారిపై అధికారులు చర్యలు తీసుకున్నారు.
- జిల్లాకు చెందిన ఓ జంటకు మూడో కాన్పులోనూ పాప పుట్టగా.. ఆర్థిక భారమని భావించారు. దాంతో ఓ కేంద్ర ప్రభుత్వ అధికారి మధ్యవర్తిగా ఉండి.. మరో దంపతులకు ఇప్పించారు. నెల రోజుల తర్వాత.. విషయం బయటకు పొక్కింది. అధికారులు కన్నవారికి కౌన్సెలింగ్ ఇచ్చి.. పాపను వారికేఅప్పగించారు. నెల రోజులు పెంచిన తల్లి తీవ్ర మనోవేదనకు గురయ్యారు. మధ్యవర్తిగా వ్యవహరించిన వారిపై క్రిమినల్ కేసు పెట్టారు.

ఇచ్చారని.. పెంచుకోవద్దు!



చట్ట పరిధిలో లేని దత్తతతో ఎప్పటికైనా ఇబ్బందే

శిశు అక్రమ విక్రయాలతో ఇరు కుటుంబాల్లో కల్లోలం

ఈనాడు, నెల్లూరు

నిస్సహాయత.. ఆర్థిక స్తోమత లేకపోవడం.. ఇలా.. కారణమేదైనా కొందరు బొడ్డుతాడు ఊడక ముందే చిన్నారులను రోడ్డుపాలు చేస్తుంటే- మద్యపానం, ధూమపానం, ఆలస్యంగా పెళ్లిళ్లు కావడం, హార్మోన్ల లోపాలు తదితర కారణాలతో ఇంకొందరు అమ్మా నాన్న అనే పిలుపునకు దూరమవుతున్నారు. ఈ క్రమంలో ఒకరు భారంగా భావించే చిన్నారులను.. మరొకరు ప్రాణాధారం చేసుకునేందుకు ఎంతోమంది పోటీ పడుతుండగా- అదే అదనుగా మధ్యవర్తులు మాయమాటలు చెప్పి అక్రమంగా శిశు విక్రయాలు, దత్తత చేస్తున్నారు. ఆ తర్వాత చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వ పరంగా దత్తత తీసుకుంటే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో!	
శిశు గృహాలు	1
అందులో ఉన్న పిల్లలు	9
దత్తతకు దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నవారు	230
గత పదేళ్లలో దత్తత ఇచ్చిన పిల్లలు	140 మంది (2011 నుంచి)

క్రయ విక్రయాలకు పాల్పడితే..

- చట్టాన్ని అతిక్రమించి.. అనాథ, అప్పగించిన బాలలను దత్తత పొందినా, ఇచ్చినా.. గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలుశిక్ష/ రూ.లక్ష జరిమానా.. కొన్నిసార్లు రెండూ పడే అవకాశం ఉంది.
- కారణమేదైనా.. బాలుడు/బాలికను అమ్మడం, కొనడం నేరం. అలా చేసేవారికి గరిష్ఠంగా అయిదేళ్ల వరకు కఠిన శిక్ష, రూ.లక్ష జరిమానా.
- వైద్యశాల, నర్సింగ్‌హోం, ప్రసూతీ గృహాల్లో పని చేసే వ్యక్తులు ఈ క్రయ విక్రయాలకు పాల్పడితే.. వారికి మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు శిక్ష విధిస్తారు.

“గడిచిన పదేళ్లలో జిల్లాలో ప్రభుత్వం తరఫున సుమారు 70 మంది చిన్నారులను దత్తత తీసుకోగా. . ప్రభుత్వ పరిధిలో లేనివి వందల సంఖ్యలో ఉంటాయని సమాచారం.”

“పిల్లలు పుట్టినప్పుడు ఉన్న ఆర్థిక పరిస్థితులు.. ఆ తర్వాత మారొచ్చు.. పేగు తెంచుకుని పుట్టిన బిడ్డపై మళ్లీ తీపి పుట్టుకురావచ్చు. విక్రయించిన వారికే.. మళ్లీ డబ్బు అవసరమైన గొడవలు పడొచ్చు.. ఇలా ఎన్నో రకాలుగా భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తవచ్చు.”

దత్తత తీసుకునే పద్ధతిలా...

రెండేళ్ల కిందటి వరకు.. పిల్లలు లేని దంపతుల నుంచి దరఖాస్తు తీసుకుని.. విచారణ అనంతరం ఇచ్చేవారు. ఇప్పుడు ఇదంతా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంది. ఈ పద్ధతిలో కొంచెం ఆలస్యమైనా. . భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవు.

- మొదటగా సి.ఎ.ఆర్.ఎ(కారా) అనే వెబ్‌సైట్‌లో పాన్‌కార్డుతో నమోదు చేసుకోవాలి.
- అనంతరం ఆ దంపతుల కుటుంబ చిత్రం, వివాహ, ఆదాయ, వయసు ధ్రువీకరణ, చిరునామా పత్రాలు, ఆరోగ్య పరీక్షల నివేదికలతో పాటు ప్రాజెక్టు డైరెక్టర్ డీడబ్ల్యూ అండ్ సీడీపీ, నెల్లూరు చిరునామాకు రూ. ఆరువేల డీడీ జత చేసి ఇవ్వాలి.
- బిడ్డను తీసుకునేటప్పుడు రూ. 50వేలు కార్పస్ ఫండ్ డీడీ రూపంలో కట్టాలి.
- ఆస్తి వివరాల పత్రాల నకలుపై గెజిటెడ్ అధికారి అటెస్టేషన్ చేసి ఇవ్వాలి.

చట్టబద్ధంగా తీసుకోవాలి

అవగాహన లోపంతో కొందరు చట్ట వ్యతిరేకంగా పిల్లలను దత్తత తీసుకుని.. తర్వాత ఇబ్బందులు పడుతున్నారు. క్రిమినల్ చర్యలకు గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం 'కారా' వెబ్‌సైట్ ద్వారా పిల్లలను దత్తత ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తోంది. దీని ద్వారా తీసుకోవడం ఉత్తమం. పిల్లలు వద్దనుకునేవారు ఐసీడీఎస్ సిబ్బందికి అందజేస్తే.. వారి బాధ్యత ప్రభుత్వం చూసుకుంటుంది. – సురేష్, డీసీపీవో, నెల్లూరు.

జిల్లాలో సమృద్ధిగా ఇసుక నిల్వలు: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో ఇసుక నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, మూడు యార్డుల్లో 70 వేల టన్నులు అందుబాటులో ఉందని.. సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేదని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'జిల్లాలో గత ఏడాది కంటే 50 శాతం తక్కువ ధరకు.. టన్ను ఇసుక రూ. 350కే అందిస్తున్నాం. రోజూ సుమారు 3,500 టన్నులు అవసరం ఉండగా.. 4,500 టన్నుల వరకు అందుబాటులో ఉంది. ఈ పరిమాణాన్ని ఏడు వేల టన్నులకు పెంచనున్నాం. జిల్లాతో పాటు ప్రకాశం, బాపట్ల జిల్లాలకూ అందిస్తాం. కందుకూరులో మరో యార్డు ప్రారంభిస్తున్నాం. ఈ నెల 15వ తేదీ తర్వాత మరో నాలుగు ఓపెన్ రీచ్‌లు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాం. త్వరలో డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా 2,26,198 టన్నులు, సెమి మెకనైజ్డ్ రీచ్‌ల ద్వారా 13,03,500, ఓపెన్ రీచ్‌ల ద్వారా 2,86,500 టన్నుల ఇసుకను జిల్లా ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు చేపట్టాం' అని వివరించారు.

అక్రమ రవాణాపై నిఘా

నూతన ఇసుక విధానంలో అక్రమాలు జరగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. ఇప్పటి వరకు 350 మందిపై కేసులు నమోదు చేసి.. 290కి పైగా వాహనాలను సీజ్ చేసినట్లు వివరించారు.

టోల్‌ఫ్రీ నంబరు

'నెల్లూరు నగరపాలక సంస్థలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో ఫెసిలిటేషన్ సెంటరు, హెల్ప్‌డెస్క్, ఎనిమిది మంది సచివాలయ ఉద్యోగులతో సమన్వయ బృందాన్ని ఏర్పాటు చేశాం. వీరు వినియోగదారులు, రవాణాదారులతో సమన్వయం చేసుకుంటూ.. సకాలంలో సరఫరా అయ్యేలా కృషి చేస్తారు. ఇసుక ఫిర్యాదులు, సమాచారం, సందేహాలకు టోల్‌ఫ్రీ నంబరు 0861-2943569ను ఏర్పాటు చేశాం. ప్రజలు సంప్రదించవచ్చు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం' అని హెచ్చరించారు.

వాతావరణ మార్పులకు అనుగుణంగా శాటిలైట్ టెక్నాలజీ

ప్రారంభమైన అంతరిక్ష వారోత్సవాలు


అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభిస్తున్న అతిథులు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: మారుతున్న వాతావరణ మార్పులకు అనుగుణంగా శాటిలైట్ టెక్నాలజీని రూపొందిస్తున్నామని షార్ సీనియర్ శాస్త్రవేత్త, రీజనల్ మేనేజర్ దామోదరన్ పేర్కొన్నారు. నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం సతీష్ ధావన్ (షార్) ఆధ్వర్యంలో అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వాతావరణంలో వస్తున్న మార్పులను గమనిస్తుండాలని, స్పేస్ టెక్నాలజీ ఏవిధంగా ఉపయోగ పడుతుందో తెలుసుకోవాలన్నారు. వీఎస్‌యూ వీసీ ఆచార్య ఎన్.విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని తెలిపారు. భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు బాటలు వేసుకోవాలని సూచించారు. మంగళ, బుధవారాలు వారోత్సవాలు జరగనున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, కన్వీనర్ మురళి, ఏజీఎం శ్రీధర్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

లేవని షట్టర్లు.. కనిగిరికి కన్నీళ్లు


క్రాస్ రెగ్యులేటరులో ఒక తూము నుంచే వెళుతున్న నీరు


కనిగిరి జలాశయం ప్రధాన కాలువలో భారీగా నిల్వ

సంగం, న్యూస్‌టుడే: కనిగిరి జలాశయం అడుగంటింది. దీని పరిధిలో తాగు, సాగునీటి అవసరాల నిమిత్తం సోమశిల జలాశయం నుంచి రెండు వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేసినా.. అది సంగం వద్దనే భారీ స్థాయిలో ఆగిపోతోంది. కారణం.. కనిగిరి జలాశయం ప్రధాన కాలువలో 1.4 కి.మీ. వద్దనున్న క్రాస్ రెగ్యులేటర్‌లోని అయిదు షెట్టర్లలో.. నాలుగు నియంత్రణ కోల్పోవడమే.. దీంతో ఆశించిన లక్ష్యం నెరవేరకపోగా- కొత్త సమస్యలకు ఆస్కారమిచ్చినట్లవుతోంది.

తొలుత ఒకటి.. తర్వాత మూడు

ఒక్కో షట్టరు ద్వారా వేయి క్యూసెక్కుల చొప్పున.. అయిదువేల క్యూసెక్కులు తరలే ఈ నియంత్రణ వ్యవస్థను వైకాపా విస్మరించింది. ఫలితంగా దక్షిణం వైపు ప్రారంభంలోని షట్టరు నియంత్రణ కోల్పోయింది. ఇప్పుడు మరో మూడింటి పరిస్థితి అదేలా మారింది. ఉత్తరం వైపున్న రెండో షట్టరు మాత్రమే పని చేస్తుండగా.. దాని ద్వారా వేయి క్యూసెక్కులే కనిగిరి జలాశయానికి వెళుతోంది. దీంతో రెగ్యులేటర్ వెనుకభాగంలో భారీగా నీటి నిల్వ చేరింది. సంగం ఆనకట్ట వద్ద 11.6 అడుగుల మట్టం కొనసాగుతోంది.

క్రాస్ రెగ్యులేటర్ అత్యంత కీలకం

కనిగిరి జలాశయం ప్రధాన కాలువలో.. సంగం శివార్లలో 1.4 కి.మీ. వద్దనున్న క్రాస్ రెగ్యులేటర్ అత్యంత కీలకం. ఇక్కడ 6×3.5 మీటర్ల కొలతతో.. ఒక్కొక్కటి ఆరు టన్నులతో.. అయిదు షట్టర్లు ఉంటాయి. 2015లో నాటి తెదేపా ప్రభుత్వం రూ. కోటి వ్యయంతో వీటిని అమర్చింది. ప్రత్యేకంగా విద్యుత్తు సరఫరా వ్యవస్థనూ ఏర్పాటు చేయించింది. సంగం బ్యారేజీ నుంచి తరలించే సాగునీటిని.. నిర్ణీత మట్టం చేసి.. ఇక్కడి నుంచి కనిగిరి జలాశయానికి, బెజవాడ పాపిరెడ్డి కాలువకు తరలిస్తారు.

1.5 లక్షల ఎకరాల ఆయకట్టు


ఒక షట్టరు మాత్రమే పనిచేస్తుండటంతో.. కనిగిరి జలాశయానికి పుష్కలంగా నీరు వెళ్లడం లేదు. ప్రస్తుతం సోమశిలకు వస్తున్న వరద ప్రవాహం నుంచి వీలైనంత కనిగిరికి తరలించుకుంటే.. 1.5 లక్షల ఎకరాలకు మేలు జరుగుతుంది. తొలిపంట సాగుకు సకాలంలో నీటి విడుదలకు ఉపయోకరంగా ఉంటుంది. ఇదే రీతిలో వదిలేస్తే.. జలాశయం పరిధిలో 1.5 లక్షలు, బెజవాడ పాపిరెడ్డి కాలువ ఆయకట్టు లక్ష.. మొత్తం 2.5 లక్షల ఎకరాలకు సాగునీటి సరఫరా ప్రశ్నార్థకమవుతుంది. రెగ్యులేటర్ వద్ద ఒత్తిడి అధికమైతే.. పని చేస్తున్న ఒక్క షట్టరు కొట్టుకుపోయే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

రూ. 65 లక్షలతో ప్రతిపాదన

క్రాస్ రెగ్యులేటర్ వద్ద షట్టర్ల అత్యవసర మరమ్మతులకు రూ. 65 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రభుత్వం ఆమోదించిన వెంటనే.. పనులు చేయించి, తొలి పంటకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

– రమణ, బెజవాడపాపిరెడ్డి కాలువ, ఏఈ

సైబర్ వల.. ఉక్కిరిబిక్కిరి ఈ వల



ఈనాడు, నెల్లూరు: నేరవార్తలు, న్యూస్‌టుడే

'అచ్చం సీబీఐ అధికారిగా వ్యవహరించారు.. సైబర్ పోలీసులమంటూ బెదిరించారు.. ఆయన వివరాలన్నీ చెప్పేస్తూ నిజమైన అధికారులే అన్నట్లు నమ్మించారు. . వీడియో కాల్ విచారణ పేరిట హడావుడి చేశారు. చివరకు కేసు నుంచి బయటపడాలంటే రూ. 15 కోట్లు ఇవ్వాలని బెదిరించారు.

– ఇది సాక్షాత్తు భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డికి సైబర్ నేరగాళ్ల నుంచి ఎదురైన సంఘటన. దీనిపై ఆయన సోమవారం నెల్లూరు నగరంలోని వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

సాయం చేస్తున్నట్లు...

గత నెల 27వ తేదీ ఉదయం 8 - 9 గంటల మధ్య.. విజయవాడలో ఉన్న వాకాటి నారాయణరెడ్డికి ఓ నంబరు నుంచి ఫోన్ వచ్చింది. పన్‌షుల్ అగర్వాల్ అనే పేరుతో పరిచయం చేసుకుని.. మీ పేరుతో ఓ పార్సిల్‌ను ముంబయి నుంచి థాయిలాండ్‌కు పంపించామని, అందులో పాస్‌పోర్టు, బ్యాంకు కార్డులు, ఇతర సామగ్రితోపాటు 200 గ్రాముల ఎండీహెచ్‌ఏ డ్రగ్స్ ఉన్నాయని చెప్పారు. అవి నేను పంపలేదని వాకాటి చెప్పగా.. మీ ఆధార్‌కార్డు వివరాలతో ఎవరైనా పంపి ఉంటారని.. మీ కాల్ సైబర్‌క్రైమ్స్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తాను.. ఫిర్యాదు చేయమని చెప్పారు. ఆ మాటలు నమ్మిన నారాయణరెడ్డి రవిచంద్ర అనే వ్యక్తికి ఫిర్యాదు చేశారు. వీడియో కాల్ ద్వారానే ఆధార్‌కార్డు వివరాలు కనుక్కుని.. ఆ తర్వాత మీపై మనీ లాండరింగ్ కేసులున్నాయని, సీబీఐ కేసు ఉందని చెప్పారు. దానికి అవన్నీ వ్యాపార కేసులని, ప్రస్తుతం కోర్టులో ఉన్నాయని చెప్పగా.. మీ పేరుతో ముంబయిలో బ్యాంకు ఖాతా ఉందని, అందులో 43 మిలియన్ల యూఎస్‌డీ వచ్చిందన్నారు. తనకు ఖాతా లేదని వాకాటి చెప్పగా.. మీ ఆధార్, కేవైసీ దుర్వినియోగమై ఉండొచ్చని, వెరిఫికేషన్ పూర్తయ్యే వరకు సెల్ఫ్ కస్టడీలో ఉండాలని నమ్మబలికారు. విషయం ఎవరికీ చెప్పవద్దని, విజయవాడలో ఉంటున్న రూమ్ నుంచి బయటకు వెళ్లవద్దని చెప్పడంతో ఆయన అక్కడే ఉండిపోయారు. రెండు రోజుల తర్వాత.. మళ్లీ ఫోన్ చేసి.. అదే తరహా బెదిరింపులకు పాల్పడ్డారు. వివిధ పేర్లు.. వివిధ అంశాలతో బెదిరిస్తూ.. మిమ్మల్ని తప్పించేందుకు చూస్తున్నామని, దీనికి రూ.15 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పార్టీ దూరం పెట్టేలా చేస్తామంటూ..

తనకు ముంబయిలో అకౌంట్ లేదని, నవాబ్ మాలిక్‌తో తనకు సంబంధం లేదని, దాదాపు పదేళ్లుగా ముంబయి రాలేదని, ఇప్పటికే వ్యాపారాల్లో నష్టపోయా.. మీరు అడిగిన డబ్బు ఇవ్వలేనని వాకాటి చెప్పగా.. సైబర్ నేరగాళ్లు బెదిరింపులకు దిగారు. నిన్ను కస్టడీలోకి తీసుకుని విచారణ చేస్తామని, పార్టీకి దూరం పెట్టేలా చేయడంతో పాటు, ప్రజలు అసహ్యించుకునేలా చేస్తామని బెదిరించారు. తర్వాత అసిస్టెంట్ మానిటరింగ్ అధికారినంటూ మరో వ్యక్తి లైన్‌లోకి వచ్చి.. ఇప్పటి వరకు మీ మీద మంచిగా చెప్పిన అధికారి, ఇప్పుడు అడ్డగోలుగా కేసులు పెడుతున్నారని, అందులో టీపీడీఏ(టాడా)కేసు పెట్టాలని ఫైల్ తయారు చేస్తున్నట్లు బెదిరించారు. ఈ నెల 10వ తేదీ ముంబయి రావాలని, లేకుంటే మీ లైఫ్ రిస్క్‌లో పడుతుందని హెచ్చరించారు. ఈ నెల 4వ తేదీ వరకు ఎప్పటికప్పుడు వారికి సమాచారం ఇచ్చిన వాకాటి.. ఇదంతా సైబర్ నేరగాళ్ల పని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా..

ఇబ్బంది పెడుతున్నారు

నర్సింగ్ విద్యార్థినుల ఆవేదన


నర్సింగ్ యువతులతో చర్చిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత

న్యూస్‌టుడే, కావలి: 'పరీక్షలకు ముందు హాల్‌టికెట్ల జారీలో జాప్యంపై ఆందోళన చేశామని కళాశాల యాజమాన్యం మాపై కక్ష కట్టింది. ఇంటర్నల్ మార్కులు తగ్గించారు. ఇప్పుడు కోర్సు పూర్తయినా, ధ్రువపత్రాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వస్తున్నా.. చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన తామంతా.. కొద్దిరోజులుగా కళాశాల యాజమాన్యం, అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు. నర్సింగ్ శిక్షణ ధ్రువీకరణ పత్రాలు సహా.. ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు కూడా వారి వద్దనే ఉన్నాయి. మీరైనా తగిన చర్యలు తీసుకోండి' అంటూ శ్రీకాకుళం, తుని తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు వాపోయారు. కావలి పట్టణంలోని ఓ నర్సింగ్ కళాశాలలో చదివిన వీరంతా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో వంశీకృష్ణకు మొరపెట్టుకున్నారు. దాంతో ఆయన తగు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజితను ఆదేశించగా.. ఆమె కళాశాల నిర్వాహకులతో చర్చిస్తున్నారు.

(c) eenadu



శిక్షణలో మహిళలు

అతివలకు ఉపాధి బాట

వైకాపా ప్రభుత్వంలో నిర్వీర్యం

మహిళా ప్రాంగణంలో ఉచిత శిక్షణలు ప్రారంభం

న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య)

వైకాపా ప్రభుత్వం నిర్వీర్యంచేసిన మహిళా ప్రాంగణంలో మళ్లీ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. శిక్షణ తీసుకుంటున్న మహిళలతో కళకళలాడుతోంది. ఎన్టీ రామారావు సీఎంగా ఉన్నప్పుడు నెల్లూరులోని గాంధీనగర్‌లో ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. మహిళలకు కుట్టు, కంప్యూటర్, బ్యూటీషియన్, బేకరీ, వర్మీకంపోస్టు, నాలుగురకాల నర్సింగ్ కోర్సులు, బైండింగ్, ప్రింటింగ్, వంటలకు సంబంధించిన కోర్సులు నేర్పించడమే కాదు. . వారు ఆర్థికంగా ఎదిగేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేవారు. గత వైకాపాప్రభుత్వం ప్రాంగణాన్ని పట్టించుకోక అయిదేళ్లు ఎలాంటి కార్యకలాపాలు జరగలేదు.

కూటమి ప్రభుత్వం రాకతో..

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మహిళల ఆర్థిక చేయూతకు ప్రాంగణాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. మహిళలకు ఉచితంగా శిక్షణలు ప్రారంభించింది. ఇందుకు రూ.6 లక్షలు కేటాయించారు. తాజాగా మరో రూ.10 లక్షలు జడ్పీ నిధులు కేటాయించి ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభించారు. శిక్షణలో భాగంగా గతనెల 27 నుంచి 30 మంది మహిళలకు, యువతులకు అధునాతన కుట్టులో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. వీరికి 30 రోజులు శిక్షణ ఉంటుంది. రూ.1500 విలువజేసే మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తారు. వీరికి శిక్షణ పూర్తికాగానే మరో బ్యాచ్‌కు ఇవ్వనున్నారు. నగరం నుంచే కాదు జిల్లా నలుమూలల నుంచి మహిళలు, యువతులు వస్తున్నారు. కొందరు ప్రాంగణంలో ఉన్న వసతి గృహంలో ఉంటున్నారు.

వినియోగంలోకి ప్రింటింగ్ ప్రెస్

ప్రాంగణంలో ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌ను వైకాపా ప్రభుత్వం మూసివేయగా.. కూటమి ప్రభుత్వం వినియోగంలోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఐసీడీఎస్, మెప్మా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల పుస్తకాలు, కరపత్రాలు ముద్రిస్తున్నారు.

కుటుంబానికి ఆధారం..

బి.శ్రావ్య, డైకస్‌రోడ్డు



ఇంటర్ వరకు చదివా. పెళ్లై ఇద్దరు పిల్లలు. భర్త ఆటోడ్రైవర్. ఇద్దరం పనిచేస్తే కాతీన కుటుంబం సవ్యంగా నడవదు. కుట్టులో శిక్షణ తీసుకోవాలనుకున్నా. ప్రస్తుతం జాకెట్లు, లంగాలు, పావడాలు కుట్టడం నేర్చుకున్నా. మార్కెట్‌లో వివిధ రకాల డిజైన్ల జాకెట్లకు డిమాండ్ ఉంది. దీనిద్వారా ఉపాధి పొందొచ్చు.

మొదటి విడత శిక్షణ ప్రారంభించాం

కె.మాధవి, జిల్లా మేనేజర్



మహిళా ప్రాంగణంలో కుట్టు శిక్షణలో మొదటి బ్యాచ్‌ను ఇటీవల ప్రారంభించాం. 30 మంది మహిళలు, యువతులు ఉచిత శిక్షణ తీసుకుంటున్నారు. ప్రాంగణానికి పూర్వపు వైభవం తీసుకురానున్నాం. పలు శిక్షణలు, ఉపాధి కార్యక్రమాలు విస్తృతం చేయనున్నాం. జిల్లా ఉన్నతాధికారుల సహకారంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం.

టైలరింగ్ అంటే ఇష్టం..

వి.కామాక్షి, గాంధీనగర్



చిన్ననాటి నుంచి టైలరింగ్ అంటే ఇష్టం. మహిళా ప్రాంగణంలో కుట్టులో ఉచిత శిక్షణ అంటూ ప్రకటన ఇచ్చారు. పెళ్లై ఇంటి వద్దే పిల్లల ఆలనా పాలనా చూసుకుంటున్నా. నాకు టైలరింగ్ నేర్చుకోవాలనిపించింది. పిల్లలను స్కూల్‌కు పంపిన తరువాత శిక్షణకు వస్తున్నాను. పూర్తయిన వెంటనే ఇంటి వద్దే దుస్తులు కుట్టుకుంటూ ఉపాధి పొందుతా.

కాకర.. సిరుల రుచి

న్యూస్‌టుడే, అల్లూరు

మండలంలో నీటి వసతి ఉండడంతో దశాబ్దాలుగా వరి వేస్తున్నారు. ఎంత కష్టపడినా శ్రమకు తగిన ఫలితం దక్కడం లేదు. దీంతో కూరగాయల సాగుపై దృష్టి పెడుతున్నారు. ఇలాగే మండలంలోని ఇందుపూరు పల్లిపాడుకు చెందిన శరభయ్య కాకర వేసి లాభాలు సాధించారు. ఆయనకున్న పొలంలో ఎకరాలో కాకర వేశారు. మూడు నెలలో రూ.60 వేల వరకు ఆదాయం పొందారు.

సాగు ఇలా..: పొలాన్ని బాగా దున్నారు. సాళ్లు తీసి అందులో పశువుల ఎరువు వేసి భూసారం పెంచారు. అనంతరం విత్తనాలు నాటారు. 42 రోజులకు పూత ప్రారంభమైంది. రసాయన ఎరువుల కంటె సహజసిద్ధ ఎరువుల వాడారు. దీంతో తెగుళ్లు, చీడపీడల సమస్య తగ్గింది. వేపనూనెను ఎక్కువగా పిచికారీ చేశారు. కాపు బాగా వచ్చింది. 62 రోజుల నుంచి కోతకు వచ్చాయి. ప్రారంభంలో 90 కేజీల నుంచి 250 కేజీల వరకు దిగుబడి వచ్చింది. మూడు రోజులకు ఒకసారి కోత కోశారు. దాదాపు నాలుగు టన్నుల వరకు దిగుబడి సాధించారు. కేజీ రూ.25 చొప్పున అమ్మకాలు చేశారు. దాదాపు రూ.లక్ష వరకు రాబడి వచ్చింది. సేద్యం, విత్తనాలు, కూలీలు తదితర వాటికి రూ.40 వేలయ్యాయి. ఇవి పోను ఆదాయంగా రూ.60 వేలు మిగిలాయి. కుటుంబ సభ్యులతో కలిసి స్వయంగా పనులు చేశారు.

రైతేరాజు

సమస్య- సమాధానం

సమస్య : వరి విత్తనాల్లో ఫౌండేషన్, సర్టిఫైడ్ రకాలు ఉన్నాయి. వీటిలో ఏది ఉత్తమం? – బాబు, అల్లూరు

సమాధానం : దిగుబడుల్లో పెద్దగా మార్పులు ఉండవు. ఫౌండేషన్ విత్తనాలు అయితే మూడుసార్లు సాగుకు వినియోగించుకోవచ్చు.

? విత్తనాలు కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి? –చిట్టిబాబు, ఇస్కపల్లి

✔ కొనుగోలు చేసిన రకాలు దుకాణం నుంచి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి.

? ప్రభుత్వం నుంచి రాయితీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయా? –శీనయ్య, అల్లూరు

✔ రావాల్సి ఉంది. వస్తే సమాచారం ఇస్తాం.

? ఎకరాకు జింక్ సల్ఫేటు ఎంత వాడుకోవాలి? –రాంబాబు, అల్లూరుపేట

✔ ఎకరాకు 20 కేజీల వరకు వేసుకోవచ్చు. ఒకసారి వేస్తే మూడు సంవత్సరాల వరకు జింక్ లోపం రాదు.

(రైతుల సందేహాలకు వ్యవసాయాధికారిణి లలిత సమాధానాలు ఇచ్చారు.) – న్యూస్‌టుడే, అల్లూరు

బొప్పాయి.. కాసులు కురిసి

పొదలకూరు, ముత్తుకూరు, న్యూస్‌టుడే



మెట్ట ప్రాంతం.. వర్షాభావంతో పంటలు సరిగా పండడం లేదు. ఎంత కష్టపడినా నష్టాలు వస్తున్నాయి. దీంతో ఓ యువకుడు సంప్రదాయ పంటలకు స్వస్తిపలికారు. ఉద్యాన పంటల వైపు మళ్లారు. నేల స్వభావానికి తగినట్లుగా బొప్పాయి వేశారు. సిరులు పండిస్తున్నారు. మండలంలోని పార్లపల్లి గ్రామానికి చెందిన దేగా శివప్రసాద్ రెడ్డి వారి కుటుంబానికి ఉన్న ఆరు ఎకరాల్లో రెడ్‌లేడి -786 రకం బొప్పాయి మొలకలు తెచ్చి నాటారు. మల్చింగ్ షీట్లు వేసి వేశారు. నీటి ఎద్దడి లేకుండా క్రమంతప్పకుండా అందించేందుకు బిందు విధానాన్ని ఏర్పాటుచేశారు. ఎకరానికి రూ.1.25 లక్షల వరకు ఖర్చు చేశారు. అయిదెకరాలకు సుమారు రూ.ఆరు లక్షల వరకు ఖర్చు పెట్టారు. ఎండలు ఎక్కువగా ఉన్నా బెట్టకు రాకుండా నీరు పెట్టారు. దీంతో కాపు బాగా వచ్చింది. సాధారణం ఎకరానికి 20 టన్నుల దిగుబడి వచ్చే ఈ పంట శివప్రసాద్‌రెడ్డికి రెండింతలు అంటే 40 టన్నుల వరకు వచ్చిందని తెలిపారు. ఇప్పటివరకు 175 టన్నుల పంట తీశామన్నారు. 14 నెలల పంట పూర్తయ్యేలోపు రూ.17.50 లక్షల రాబడి వస్తోందన్నారు.

రబీలో అనువైన రకాలివే

కావలి, న్యూస్‌టుడే: రబీలో వరి సాగు చేసే రైతులు పంట కాలం, వంగడాల ఎంపికలో అప్రమత్తంగా వ్యవహరించాలని కావలి మండల వ్యవసాయాధికారిణి ఎ. లలిత సూచించారు. దీర్ఘకాలికంగా అయితే బీపీటీ 5204, స్వల్పకాలికంలో ఎన్‌ఎల్‌ఆర్ 34449, ఆర్‌ఎన్‌ఆర్ 15048, కేఎన్‌ఎం 1638 రకాలు మేలని పేర్కొన్నారు. కావలి ప్రాంత రైతులు ఈ రకాల వరి వంగడాలు శ్రేయస్కరమన్నారు. వాతావరణ పరిస్థితులు, చీడపీడలను తట్టుకొని అధిగమించేలా ఇవి అక్కరకొస్తాయన్నారు. రబీలో గరిష్ఠంగా 145 రోజులు, స్వల్పకాలికమైతే 120 రోజులుగా తెలిపారు. దీర్ఘకాలిక సాగు చేసే వారంతా మూడో పది రోజుల్లో నార్లు పోసుకోవాలన్నారు. అదే స్వల్పకాలికమైతే రైతులు వచ్చే నెల 15వ తేదీ లేక 20వ తేదీ తరువాత స్వల్పకాలికాలు వేసుకోవాలన్నారు. వరి విత్తనాలను మేలైన రకాలు కొనుగోలు చేయడంతోపాటు అనువైన సమయంలో నాటితే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. నార్లు పోసుకునే ముందుగానే మొలక శాతాన్ని కూడా పరీక్షించుకోవాలని సూచించారు. దున్నడానికి ముందుగానే పచ్చిరొట్ట ఎరువు వినియోగించాలన్నారు. అలా చేస్తే గత పంటకు చెందిన అవశేషాలన్నీ భూమిలో కలవడంతోపాటు హానికరమైన క్రిమికీటకాలు నశిస్తాయన్నారు.

సీజన్కు బట్టి సాగు.. దిగుబడులు బాగు



పెసర

న్యూస్‌టుడే, సీతారామపురం, కలిగిరి

పంటల సాగులో విత్తనాల ఎంపికే కీలకమని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శివనారాయణ సూచించారు. సీజన్ల అనుసరించి సాగు చేస్తే లాభాలు వస్తాయని వివరించారు. రబీ సీజన్‌లో రైతులు ఇప్పటికే పొలాలు దున్నే సిద్ధం చేసిన నేపథ్యంలో నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకుంటే దిగుబడి ఎక్కువగా సాధించవచ్చన్నారు. ఈశాన్య రుతుపవనాలతో అక్టోబరు నెలనుంచి వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మినుము, పెసర, శనగ, జొన్న, పొద్దుతిరుగుడు, దనియాలు, పొగాకు, నువ్వు తదితర పంటలు వేసుకోవచ్చన్నారు. ఉదయగిరి, వింజమూరు, ఆత్మకూరు సబ్‌డివిజన్‌లోని ఎర్రనేలల్లో పెసర, పొగాకు, నువ్వు (డిసెంబరు 15 నుంచి జనవరి 15 వరకు) సాగు చేసుకోవచ్చు. నల్లనేలల్లో ఉదయగిరి, వింజమూరు, ఆత్మకూరు, కందుకూరు, కావలి డివిజన్ల పరిధిలోని మండలాల్లో పెసర, మినుము, శనగ, జొన్న, పొద్దుతిరుగుడు, దనియాలు, పొగాకు, నువ్వులు (డిసెంబరు 15 నుంచి జనవరి 15 వరకు) సాగు చేసుకోవచ్చు.



జొన్న

రెవెన్యూ అర్జీలే అధికం

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం మొక్కుబడిగా మారింది. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదు. కలెక్టరేట్‌లో అర్జీలు అందించడమే తప్ప.. పరిష్కారం కావడం లేదు. ముఖ్యంగా రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కారం కాక.. ఆ శాఖ సమస్యలపై భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల వేదిక కార్యక్రమానికి 264 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 126 అర్జీలు ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా కలెక్టర్ ఒ. ఆనంద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సూచించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, అధికారులు

చక్కెర కర్మాగారం ఎప్పుడు ప్రారంభిస్తారు



కోవూరు షుగర్ ఫ్యాక్టరీని నెల్లూరు- ముంబయి జాతీయ రహదారికి పక్కన 126 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. 15 ఏళ్లుగా మూసివేశారు. ఫ్యాక్టరీని తెరిపించి సహకార రంగంలోనే నడుపుతామని 2019లో జగన్, ఈ ఏడాది చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అమలు చేయలేదు. తెదేపా ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలి.

– గుండవరపు శేషయ్య, శ్రీనివాసులు, జి.శేషయ్య, పి.శ్రీరాములు రైతులు

గురుకుల పాఠశాలలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి, న్యూస్‌టుడే : నెల్లూరులోని అక్కచెరువుపాడులో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ, ఫిజికల్ సైన్స్, పీఈటీ పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనరు, ప్రిన్సిపల్ జి.మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ నిబంధనల ప్రకారం ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 13వ తేదీ లోపు దరఖాస్తులను ధ్రువపత్రాలతో పాఠశాలలో అందించాలన్నారు. వివరాలకు 87126 25045 నంబరును సంప్రదించాలన్నారు.

అడవుల సంరక్షణే ధ్యేయం: డీఎఫ్‌వో

నెల్లూరు(బృందావనం), న్యూస్‌టుడే: జిల్లాలో అడవుల అభివృద్ధి, సంరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని జిల్లా అటవీ అధికారి మహబూబ్ బాషా అన్నారు. ఆయన సోమవారం నగరంలోని జిల్లా అటవీ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రేంజర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు జిల్లాతో అనుబంధం ఉందని.. గతంలో రాపూరు రేంజర్‌గా, రెండేళ్ల క్రితం ఇన్‌ఛార్జి డీఎఫ్‌వోగా పనిచేశానన్నారు. జిల్లాలోని అడవులు, వన్యప్రాణులపై అవగాహన ఉందని..దీంతోనే అడవుల అభివృద్ధి, సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రేంజర్లు రవీంద్ర బాబు, మాల్యాద్రి, డీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎఫ్‌వో మహబూబ్ బాషా

బతికుండగానే.. చంపేశారు

బతికుండగానే.. ఓ మహిళను రెవెన్యూ అధికారులు చంపేశారు. ఆమె అదే శాఖ విశ్రాంత ఉద్యోగిని కావడం గమనార్హం. బాధితురాలి కథనం మేరకు..'' దగదర్తి మండలం కొత్తపల్లి కౌరుగుంట గ్రామానికి చెందిన మావూరి చిన్నమ్మ వీఆర్వోగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగ సమయంలో కావలికి బదిలీ కాగా.. కొంత కాలం అక్కడే ఉన్నారు. అదే అదునుగా స్థానికంగా ఉన్న ఓ మహిళ ఆమె అయిదు ఎకరాల పొలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కోర్టుకు వెళితే.. తాను చనిపోయినట్లు మరణ ధ్రువీకరణపత్రం పుట్టించి.. కేసు కొట్టేసేలా చేశారు. రెవెన్యూ ఉద్యోగినిగా పనిచేసి.. తోటి రెవెన్యూ అధికారుల వద్ద మొరపెట్టుకున్నా.. న్యాయం జరగలేదు. 2020లోనే నేను చనిపోయినట్లు కేసును తప్పుదోవపట్టించారని కన్నీటి పర్యంతమయ్యారు. విచారించి భూమిని ఇప్పించాలని సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల వేదికలో కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

రెవెన్యూ విశ్రాంత ఉద్యోగి ఆవేదన



బీసీ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లాలోని బీసీ వసతి గృహాల్లో మరమ్మతులకు, తాగునీరు, టాయిలెట్స్, వాడుక నీరు తదితర వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిణి ప్రసూన పేర్కొన్నారు. సోమవారం నగరంలోని కార్యాలయంలో బీసీ వసతిగృహ అధికారులు, వార్డెన్లు, ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని, దీని కోసం జిల్లాలోని 42 వసతి గృహాల్లో చిన్నపాటి మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఒక్కో వసతి గృహానికి రూ.1.50 లక్షల చొప్పున ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు ఏమి అవసరమో ముందస్తు ప్రణాళికతో సిద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ సూపరింటెండెంట్ నాయక్, అదనపు వెల్ఫేర్ అధికారులు, వార్డెన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిణి ప్రసూన

గాడిద పాల వంచన కేసులో ముగ్గురి అరెస్టు

హొసపేటె, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం విజయనగర జిల్లా హొసపేటెలో జెన్నీమిల్క్ పేరిట గాడిదలు, వాటి పాల విక్రయ కంపెనీ కార్యాలయం ప్రారంభించి రైతులను వంచించిన కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు నిందితులను సోమవారం హొసపేటె పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో నూతలపాటి మురళి(43), కావలపల్లి ఉమాశంకర్(33), సయ్యద్ మహ్మద్ గౌస్(27) ఉన్నారు. విజయనగర ఎస్పీ బి.ఎల్.శ్రీహరిబాబు తెలిపిన ప్రకారం కేసు వివరాలు.. కంపెనీ ఎండీగా పరిచయం చేసుకున్న మొదటి నిందితుడు, నెల్లూరు జిల్లా వేదాయపాళెం, కేశవులునగర్‌కు చెందిన నూతలపాటి మురళి, అన్నమయ్య జిల్లా గాలివీడుకు చెందిన కావలపల్లి ఉమాశంకర్ రెడ్డి (మేనేజర్), కడప జిల్లా పోరుమామిళ్ల మండలానికి చెందిన సయ్యద్ మహ్మద్ గౌస్ (సూపర్‌వైజర్)లతో కలిసి మే నెలలో హొసపేటె బస్‌డిపో మార్గంలో జెన్నీ మిల్క్ అనే కంపెనీ కార్యాలయాన్ని ప్రారంభించి, కొంత మంది సిబ్బందిని నియమించారు. రూ.3 లక్షలు ఇస్తే మూడు గాడిదలు (ఒక యూనిట్) ఇస్తాం, వాటి పాలను లీటరుకు రూ.2350కి కొనుగోలు చేస్తామని పెద్దఎత్తున ప్రచారం చేపట్టారు. గత నెల 17 వరకు సుమారు 318 మంది రైతులు 484 యూనిట్లు కొనుగోలు చేశారు. కంపెనీ సిబ్బంది రైతుల నుంచి గాడిద కొనుగోలుకు సుమారు రూ.10కోట్లదాకా డిపాజిట్లు తీసుకున్నారు. స్థానికుల నుంచి ఫిర్యాదు అందడంతో గత నెల 18న నగరసభ అధికారులు కంపెనీ కార్యాలయంపై దాడులు చేయగా, ఎలాంటి అనుమతి లేదని తేలడంతో జప్తు చేశారు. బాధిత రైతుల నుంచి ఫిర్యాదు అందుకున్న పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, మూడు బృందాలుగా ఏర్పడి పరారీలో ఉన్న నిందితుల కోసం గాలించారు.చివరికి దొరికారు. ఆంధ్ర, తెలంగాణలోనూ వీరు వంచనలకు పాల్పడినట్లు సమాచారం ఉంది, దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు.

భూమి దూరమై.. బతుకు భారమై..



పేదరికంతో కాలం నెట్టుకొస్తున్న కుటుంబం వారిది. ఉన్న కొద్దిపాటి భూమే వారికి ఆధారం. అందులో పంటలు పండిస్తూ జీవననావను నడుపుతున్నారు. వారికి ఇద్దరు దివ్యాంగ పిల్లలు. అటు పిల్లల బాగోగులు చూసుకుంటూ.. ఆధారంగా ఉన్న భూమిలో పనులు చేసుకుంటూ పంటలు పండిస్తున్నారు. అలాంటి భూమిని వైకాపా నాయకులు స్వాధీనం చేసుకుని ముప్పతిప్పలు పెడుతున్నారు. బాధితుల కథనం మేరకు.. కలువాయి మండలం చీపినాపి గ్రామానికి చెందిన షేక్ మౌలాని, హుస్సేన్‌బీ 403 సర్వే నంబరులోని 3.4 ఎరకాల భూమిని 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. నలుగురు పిల్లల్లో కొడుకు, కుమార్తె వికలాంగులు. నడవలేని స్థితిలో ఉన్న వారి బాగోగులు చూసుకుంటూ.. భూమిని సాగు చేస్తున్నారు. వైకాపా నాయకులు ఆ భూమిని స్వాధీనం చేసుకుని పొలంలోకి వెళ్లకుండా చేస్తున్నారంటూ కలువాయి తహసీల్దారుకు విన్నవించేందుకు వెళితే లోపలకు కూడా రానీయలేదు. కలెక్టరైనా సమస్య తీసుస్తారని.. సోమవారం దివ్యాంగ కుమారుడిని తీసుకుని కలెక్టరేట్‌కు తరలివచ్చారు. భూమిలోకి వెళ్లాలంటే.. నాయకులు కొట్టి బెదిరింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. భూమే తమకు ఆధారమని కన్నీటి పర్యంతమయ్యారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)



విడవలూరు డిగ్రీ కళాశాల గ్రంథాలయాధికారికి పురస్కారం

విడవలూరు, న్యూస్‌టుడే: విడవలూరులోని వీఆర్ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయాధికారి డాక్టర్ ఈదూరి కిరణ్‌కుమార్ నేషనల్ అప్రిసియేషన్ అండ్ మెరిటోరియస్ అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బి. సుజాత సోమవారం తెలిపారు. ఈ నెల 4, 5వ తేదీల్లో కోయంబత్తూర్‌లో నిర్మల్ కాలేజీ, సొసైటీ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎస్ఏఎల్ఐఎస్- 2024) సంయుక్తంగా ఓ కార్యక్రమం నిర్వహించింది. 'జీజీ శివ కుమార్ మెమోరియల్ నేషనల్ స్పెషల్ అప్రిసియేషన్ అండ్ మెరిటోరియస్ సర్వీస్ అవార్డు'తో సత్కరించింది. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌ను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు గడువు పెంపు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జాతీయ ఉపకార వేతనాలు పొందేందుకు నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు సమయాన్ని పొడిగించారని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఈ నెల 15వ తేదీలోపు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. పరీక్ష డిసెంబర్ 8న నిర్వహిస్తారని తెలిపారు.

ఉద్యోగ ప్రకటన

శ్రీయుత ప్రాజెక్టు అధికారి, ఐ.టి.డి.ఎ. (యానాదులు), నెల్లూరు జిల్లా వారి ఆధ్వర్యంలో నడుపబడుచున్న నెల్లూరు జిల్లా పరిధిలోగల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, కొడవలూరు నందు (2024- 25) విద్యా సంవత్సరమునకు గాను అతిథి బోధన (Guest Teachers) విధానములో CBSE సిలబస్ బోధించుటకు ఖాళీగా ఉన్న పి.జి.టి. తెలుగు పోస్టునకు అర్హతగల అభ్యర్థులు 21 సం॥ నుండి 60 సం॥ వయస్సుగల వారి నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. అలాగే నవోదయ, కేంద్రీయ విద్యాలయము, స్టేట్ గవర్నమెంట్ సంస్థల నుండి రిటైర్డ్ 60 నుండి 65 మధ్య వయస్సుగల ఉపాధ్యాయులు తేది: 18.10.2024 లోగా దరఖాస్తు కోరడమైనది.

POST GRADUATE TEACHER- Telugu Subject

దరఖాస్తులు స్వీకరించుటకు ఆఖరు తేది: 18-10-2024 మరియు అర్హతలుగల పూర్తి సమాచారము కొరకు గురుకులం విభాగము, ఐ.టి.డి.ఎ. (యానాదులు), నెల్లూరు వారిని సంప్రదించగలరు.

అప్లికేషన్లు అందించవలసిన చిరునామా:

గురుకులం విభాగము, ఐ.టి.డి.ఎ.(యానాదులు), నెల్లూరు, నెల్లూరు జిల్లా.

ప్రాజెక్టు అధికారి
ఐ.టి.డి.ఎ. (యానాదులు), నెల్లూరు

కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్
నెల్లూరు జిల్లా.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర: (3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	రూ. 7,313
సవర ధర:	రూ. 58,504
వెండి గ్రాము :	రూ. 98.00

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	124
రిటైల్	146
లేయర్	110
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	241
లేయర్ మాంసం	187
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	134
లేయర్	110
బ్రాయిలర్స్	240
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	187

పల్లెటూరి పిల్లలు.. జాతీయస్థాయిలో మెరుపులు



సాధనలో విద్యార్థులు

కావలి, న్యూస్‌టుడే : వారు మత్స్యకార కుటుంబాలకు చెందిన పిల్లలు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. ఎక్కడ పోటీలు జరిగినా వెళ్లి సత్తా చాటుతున్నారు. కావలి మండలంలోని కొత్తసత్రం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆటల్లో ప్రతిభ చూపుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు మురళి వీరిలోని ప్రతిభకు పదును పెడుతున్నారు. ఇటీవల మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించారు.

ఐపీఎస్ చేస్తా..



ఏడో తరగతి చదువుతున్న ఎల్లంగారి జ్యోతి ఇటీవల మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన జంప్‌రోప్ పోటీల్లో తృతీయ స్థానం సాధించింది. గతంలో రాష్ట్ర స్థాయిలో చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. తెనాలిలో జరిగిన పోటీల్లో బంగారు పతకం దక్కించుకుంది. కడపలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లోనూ తృతీయ స్థానంలో నిలిచింది. ఐపీఎస్ చదివి సమాజానికి సేవ చేస్తానని ఈమె చెబుతోంది.

పోలీసునై ప్రజలకు సేవలందిస్తా



క్రీడల కోటాలో పోలీసు ఉద్యోగం సాధించి సమాజానికి సేవలందించడమే ధ్యేయమని ఏడో తరగతి చదువుతున్న కె.కిరణ్ చెబుతున్నాడు. ఇటీవల మహారాష్ట్రలోని శిరిడీలో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో జట్టు తృతీయ స్థానం సాధించడంలో కీలకంగా వ్యవహరించాడు. అంతకుముందు రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ శ్రేణి విజేతగా నిలిచారు. చిత్తూరులో జరిగిన కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎక్కువ పాయింట్లు సాధించి జట్టును ద్వితీయ స్థానంలో నిలపడంలో ప్రతిభ చూపాడు.

EENADU Classifieds

REAL ESTATE

నెల్లూరు రూరల్ (మం), చింతారెడ్డిపాలెం గ్రామంలోని, గజలక్ష్మి లేఅవుట్‌లో 400 అం॥లు అమ్మబడును. అం॥ 60 వేలు, ఫ్యాక్టరీలు, గోడౌన్లకు అనుకూలం. విడివిడిగా కూడా ఇవ్వబడును. ✆ 95736 02691

FLAT FOR SALE

2 BHK Flat for sale Iskon city Nellore. New construction. Price 56 Lakhs. Immediate Move. Cell: 9100207406

నెల్లూరు నగరంలో మదర్ ల్యాండ్ డెవలపర్స్ వారి నూతనంగా నిర్మించుచున్న ప్రీమియం అపార్ట్‌మెంట్స్ (రెయిన్ స్క్వేర్ థియేటర్ వెనుక & శాంతినగర్) నందు 2 BHK & 3 BHK Flats అమ్మకమునకు కలవు. Ph: 79954 22204, 79954 22201

HOUSE FOR SALE

HOUSE FOR SALE
కావలిలో 30 అంకణాలు (272 చ.గ.ల) 3BHK ఇండిపెండెంట్ హౌస్ కచేరిమిట్ట, చర్చిరోడ్, 2వ క్రాస్, కావలి,శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు (జిల్లా) నందు అమ్మకమునకు కలదు. సంప్రదించండి.
9966644110

PLOT FOR SALE

దసరా ఆఫర్; నెల్లూరు సిటీ, గూడూరులో వెంటనే ఇల్లు కట్టుకొనుటకు Ready గా ఉన్న మా లేఅవుట్‌లో లోను వసతి మరియు ఫ్రీ రిజిస్ట్రేషన్ ఆఫర్‌తో ప్లాట్లు అమ్మబడును. ✆ 79954 34866

JOBS

రుక్మిణి శిల్క్స్, కాపువీధి, నెల్లూరు నందు కట్‌పీస్, డ్రెస్ మెటీరియల్ సెక్షన్స్‌లో పనిచేయుటకు సేల్స్‌గర్ల్స్, సేల్స్ బాయ్స్, హెల్పర్స్ కావలెను. మరియు కస్టమర్ రిసీవింగ్ లేడీస్ కావలెను. నేరుగా సంప్రదించండి.

నూతనంగా ప్రారంభించిన మా కంపెనీలో M/F కావలెను. 10th to Any Qulifi, P/F Income: 18 to 25k, Age: 18 to 40, వర్క్ ఫ్రం హోమ్ కలదు. Contact number: 88853 39400, 90305 81343

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
వివరాలకు..
నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 600
Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు



వివరాలు తెలుసుకుంటున్న డీఈఈ లీలాప్రకాష్

నీటి పథకాన్ని వినియోగంలోకి తెస్తాం: డీఈఈ

బిట్రగుంట, న్యూస్‌టుడే : మండలంలోని సుందరగిరివారికండ్రికలో ఉన్న ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని త్వరలో వినియోగంలోకి తీసుకొస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ లీలాప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం బోగోలు, దగదర్తి మండలాల అధికారులు ఎం.శ్రీనివాసులు, వి.రవీంద్రనాథ్‌తో కలసి గ్రామంలోని మదర్ ప్లాంటును పరిశీలించారు. గ్రామానికి చెందిన తెదేపా నాయకులు కోడూరు వెంకటేశ్వరరెడ్డి, ఎర్రం వెంకటేశ్వరరెడ్డితో మాట్లాడారు.

9న ప్రజావేదిక గ్రామసభ

కందుకూరు, గుడ్లూరు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ప్రజావేదిక గ్రామసభను ఈ నెల తొమ్మిదో తేదీన నిర్వహిస్తున్నట్లు ఏపీవో అబ్దుల్ సోమవారం తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: మా గ్రామంలోని చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. ఎలాంటి అనుమతుల్లేవు. తూముల కంటె లోతుగా తవ్వుతుండడంతో గుంతలు పడుతున్నాయి.
- పాబోలు చిన్నసీతారామయ్య

సమాధానం: ఈ విషయం మా దృష్టికి వచ్చింది. చర్యలు తీసుకుంటాం.
- హరీష్, ఏఈ, జలవనరుల శాఖ
- కావలి, న్యూస్‌టుడే

? కందుకూరులోని గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది సిలిండర్‌కు ప్రభుత్వం నిర్ణయించిన ధర మించి రూ.870 తీసుకున్నారు.
- జి.లక్ష్మీనరసింహం, శింగమనేనిపల్లె

✓ బిల్లు మేరకు నగదు చెల్లించాలి. అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదు.
-భాస్కర్‌రావు, ఐవోసీ ఎస్‌వో
వలేటివారిపాలెం, న్యూస్‌టుడే

? మా పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పలుచోట్ల వీధి దీపాలు రాత్రి పగలు తేడా లేకుండా నిత్యం వెలుగుతున్నాయి. విద్యుత్తు వృథా అవుతుంది. **- ప్రసాద్, దుత్తలూరు**

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం
-నజీముల్లా, పంచాయతీ కార్యదర్శి
- దుత్తలూరు, న్యూస్‌టుడే

? మా గ్రామంలోని ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారిపై చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. **- రమణయ్య, దగదర్తి**

✓ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్త శుభ్రం చేయిస్తాం. **- ఈశ్వరమ్మ, పంచాయతీ సెక్రటరీ** **-న్యూస్‌టుడే, దగదర్తి**

వ్యవసాయంలో శారీరక శ్రమ తగ్గించుకోవాలి

కందుకూరు పట్టణం : వ్యవసాయంలో శ్రమ తగ్గించే పరికరాలపై ఎస్సీ మహిళా రైతులకు సోమవారం స్థానిక సీటీఆర్ఐ, కేవీకే ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ పనుల్లో ఉత్పాదకతను, సామర్థ్యాన్ని పెంచడంలో రైతులకు సహాయపడడమే లక్ష్యమని శాస్త్రవేత్తలు వివేక్‌కామత్, వెంకటేశ్ అన్నారు. వ్యవసాయ మహిళల ప్రత్యేక అవసరాలు దృష్టిలో ఉంచుకుని వారికి తగిన శ్రమ తగ్గించేవిధంగా పరికరాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనకప్ప, భాస్కర్‌రావు, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త జి.ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

వరి, వేరుసెనగ పంటలపై అవగాహన

ఉలవపాడు, న్యూస్‌టుడే: వరి, వేరుసెనగ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు మారుతీదేవి, లక్ష్మీమాధవి అవగాహన కల్పించారు. కరేడులోని ఒకటో రైతు సేవా కేంద్రంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. వరి పైరులో నారుమడి యాజమాన్య పద్ధతులు, విత్తన ఎంపిక, విత్తనశుద్ధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఏవో తిరుమల జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో రవిచంద్ర

అల్లూరు, న్యూస్‌టుడే : తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర స్వగ్రామం ఇస్కపల్లిలో కాశీ విశ్వేశ్వరయ్య ఆలయంలో సోమవారం జరిగిన దసరా ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట నెల్లూరు పార్లమెంటు తెదేపా అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, పోలిశెట్టి, బీద గిరిధర్, పలగాటి శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

చెరువులు.. కడగండ్లు



ఇది కావలి శివారు బుడంగుంట కట్ట. అధ్వానంగా తయారైంది. భారీ వర్షాలొస్తే తెగిపోయేలా ఉంది. పక్కనే రైల్వే మార్గం వెళుతోంది. తెగితే రైల్వే లైనుకు ప్రమాదం జరుగుతోంది. దీంతో ఇలాంటి వాటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాల్సి ఉంది. గతంలో రూ.65 లక్షలతో కట్ట బలోపేతం.. అలుగు మరమ్మతులకు అధికారులు అంచనాలు పంపారు. మంజూరు కాక పనులు చేపట్టలేదు.



కావలి మండలంలోని మన్నంగిదిన్నె చెరువు గత ఏడాది డిసెంబరులో మిగ్‌జాం తుపాన్‌కు కలుజు నుంచి అదనపు నీరు పోటెత్తడంతో మాతినవారిపాలెం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. కలుజు బాగుకు రూ.లక్ష అయితే చాలు.

కావలి నియోజకవర్గంలో మొత్తం చెరువులు	అత్యవసరంగా మరమ్మతులు చేయించాల్సినవి	ఆయకట్టు విస్తీర్ణం
129	47	76 వేల ఎకరాలు

కావలి, న్యూస్‌టుడే

ఎన్నో చెరువులు.. దశాబ్దాలుగా ప్రజలకు నీటి అవసరాలకు ఆధారం.. ఆలనాపాలన కరవైంది. కట్టలు గండ్లు పడి తెగిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. కంప చెట్లు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. గత వైకాపా పాలనలో నిర్వహణ కరవైంది. వీటిలో మట్టి తవ్వడంతో రూపుకోల్పోయాయి. చేలకు నీరు అందక రైతన్నకు వెతలు తప్పడం లేదు. ఇదీ కావలి నియోజకవర్గంలోని పరిస్థితి.

వైకాపా పాలనలో నిర్లక్ష్యం

వైకాపా పాలకులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించారు. గత తెదేపా ప్రభుత్వం అమలుచేసిన 'నీరు- చెట్టు' పథకాన్ని రద్దు చేశారు. మన్నంగిదిన్నె వంటి చెరువులకు అత్యవసరంగా పని చేయిద్దామన్నా, గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో చాలా గ్రామాల్లో రైతులు శ్రమదానంతో పాటు చందాలు వేసుకొని మరమ్మతులు చేసుకున్నారు. నియోజకవర్గంలో 129 చెరువులు ఉన్నాయి. వీటి పరిధిలో 76 వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతోంది. కాలువల ద్వారా నీరు అందని గ్రామాల్లో ఇవే ఆధారం. బోగోలు, అల్లూరు మండలాల్లో ఇలాగే జరుగుతోంది. ఒక్క అల్లూరు మండలంలోనే 40 వేల ఎకరాలకు పైగా సాగు ఉంది. ఇక్కడ ఉన్న రాయలు కాలం నాటి జలాశయం పూడిక చేరి నీటి నిల్వ తగ్గిపోయింది. ఎన్నో సంవత్సరాలుగా ఇది పూడిక తీతకు నోచుకోలేదు. ఆక్రమణలు పెరుగుతున్నాయి. వీటిని నిరోధించడంలో అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ❖ కావలి సముద్రానికి సమీపంలో ఉండే చెరువులు కావడం వల్ల ఎగువ నుంచి నీరు ఎక్కువ రోజులు వస్తోంది. ఈక్రమంలో ఎప్పటికప్పుడు అత్యవసరంగా ఇసుకబస్తాలు, మట్టి పనులు ముమ్మరంగా చేస్తుంటే గ్రామాల్లో ఇబ్బందులు ఉండవు. వర్షాల సీజన్ రానే వస్తోంది. అత్యవసరంగా పనులు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

నాగరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జలవనరుల శాఖ

ఇప్పటికే నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేస్తాం. రైతులకు ఇబ్బందులు లేకుండా సాగు నీరు అందిస్తాం.

గోడ శిథిలం.. ప్రజలకు ప్రమాదం



బోగోలు ఒకటో సచివాలయం సమీపంలో మురుగునీటి కాలువ గోడ కూలి ప్రమాదకరంగా మారింది. సిమెంట్ రోడ్డు కింద మట్టి కూడా కోతకు గురైంది. అసలే ఇరుకు రోడ్డు ఎదురుగా వాహనాలు వస్తే ప్రమాదాలకు గురికావాల్సిందే. మరమ్మతులు చేయించి ప్రమాదాలు జరగకుండా చూస్తామని పంచాయతీ కార్యదర్శి జహీర్ పేర్కొన్నారు. **- బిట్రగుంట, న్యూస్‌టుడే**

కాలువ లేక.. నీరు పారక



మండలంలోని కాట్రాయపాడు కాలనీ, పొలాలకు వెళ్లే రహదారిపై నీరు నిలిచి గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. సిమెంటు రహదారికి కాలువ ఏర్పాటుచేయకపోవడంతో వర్షపు నీరు నిలిచిపోతోంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌ను వివరణ కోరగా సిమెంటు రహదారికి కాలువ లేదన్నారు. ఇరిగేషన్ కాలువ ఆక్రమణకు గురైనట్లు రైతులు ఫిర్యాదు చేయడంతో వారు సర్వే చేసి కాలువకు హద్దులు చూపారన్నారు. ఆక్రమణలు తొలగించి కాలువ తవ్వితే ఇబ్బందులు ఉండవన్నారు. **- దగదర్తి, కావలి, న్యూస్‌టుడే**

మున్సిపల్ వాహనాలు శిథిలం




మున్సిపాలిటీలో చెత్త తరలింపునకు, ప్రజల దాహార్తి తీర్చేందుకు ఎంతో కాలం సేవలందించిన వాహనాలు శిథిలావస్థకు చేరాయి. రెండు ట్రాక్టర్లు, నీళ్ల ట్యాంకర్, ఆటోలు మరమ్మతులకు గురయ్యాయి. వాటికి మరమ్మతులు నిర్వహించడం లేదా తుప్పు పట్టిన వాహనాలను వేలం వేయాలి. కానీ, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి సదరు వాహనాలు మూలనపడి మరింత తుప్పు పడుతున్నాయి. మున్సిపల్ ఏఈ జి.లోకేశ్ మాట్లాడుతూ ఆటోలకు మరమ్మతులు చేయిస్తామనీ, తుప్పు పట్టిన వాహనాలను వేలం వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. **- కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే**

రెయిన్‌గేజ్ ఇలా.. భద్రత ఎలా?



ఇది వాహనాల వేగాన్ని పరీక్షించే పరికరం కాదండి. వర్షపాతాన్ని లెక్కగట్టేందుకు ఏర్పాటుచేసిన రెయిన్‌గేజ్. జాతీయరహదారి నిర్మాణానికి ముందు పాత రహదారికి దూరంగా ఏర్పాటుచేశారు. 167 బీజీ జాతీయరహదారి ఏర్పాటుతో నాలుగైదు అడుగుల దూరం మాత్రమే మిగిలింది. జాతీయ రహదారి అయినందున ఈపరికరానికి భద్రత కొరవడిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి సురక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ప్రజలు చెబుతున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి ఏఎస్‌వో కుమార్‌రాజాను అడగ్గా సీపీవో దృష్టికి తీసుకెళ్లి సురక్షిత ప్రాంతానికి మార్పు చేయిస్తామన్నారు. **- సీతారామపురం, న్యూస్‌టుడే**

భవాని.. మము బ్రోవరావమ్మా!



గుడ్లూరు : చండీమాత అలంకరణలో.. కందుకూరు : మహాచండిగా.. వింజమూరు : రాజరాజేశ్వరి అలంకారంలో..

న్యూస్‌టుడే బృందం, కావలి, కందుకూరు, ఉదయగిరి: శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని దేవాలయాల్లో సోమవారం అమ్మ వారు ప్రత్యేకాలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.



కావలి: మహాలక్ష్మిగా కనకదుర్గమ్మ.. ఉదయగిరి: చండీ అలంకారంలో.. కలిగిరి.. అన్నపూర్ణాదేవిగా జ్వాలాముఖి.. అల్లూరులో..

చెత్త.. ఇక సంపదే!

గత ప్రభుత్వ హయాంలో నిరుపయోగంగా మారిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు పూర్వ వైభవం వస్తోంది. గాంధీ జయంతి రోజున నిరుపయోగంగా ఉన్న కేంద్రాలను కూటమి ప్రభుత్వం వినియోగంలోకి తెచ్చింది. గ్రామాల్లో సేకరించిన చెత్తను ఎరువుగా మార్చేందుకు చర్యలు తీసుకుంది. పంచాయతీలకు ఆదాయం వచ్చేలా సంపద సృష్టించనున్నారు.
- న్యూస్‌టుడే, ఉదయగిరి, దుత్తలూరు



వినియోగంలోకి కేంద్రాలు

ఉదయగిరి నియోజకవర్గంలో ఎనిమిది మండలాలుండగా 143 పంచాయతీలు ఉన్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో దాదాపు అన్ని గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటుచేసింది. చాలా వాటిలో చెత్తను ఎరువుగా మార్చి సంపద సృష్టించి పంచాయతీలకు ఆదాయం వచ్చేలా ఏర్పాట్లు చేశారు. కానీ వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వీర్యం చేసింది. దీంతో నిరుపయోగంగా మారాయి.

కూటమి ప్రభుత్వంతో...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెత్త సంపద కేంద్రాలకు మంచి రోజులు వచ్చాయి. అక్టోబరు 2న గాంధీ జయంతి రోజున నియోజకవర్గంలో నిరుపయోగంగా ఉన్న 56 సంపద కేంద్రాలను తిరిగి ప్రారంభించారు. చెత్తను సేంద్రియ ఎరువుగా తయారు చేసేలా సిద్ధం చేశారు. రోజూ గ్రామంలో చెత్తను సేకరించి తడి, పొడిగా వేరు చేసి ఎరువు తయారు చేసేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా...

మొత్తం మండలాలు	8
పంచాయతీలు	143
వినియోగంలో ఉన్నవి	42
తిరిగి ప్రారంభించినవి	56
నిరుపయోగంగా ఉన్నవి	45

అన్ని చోట్లా పునరుద్ధరిస్తాం..

– శ్రీధర్‌రెడ్డి, డీపీవో

గ్రామ పంచాయతీల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాలను పునరుద్ధరించాలని మండలాల అధికారులు, సిబ్బందికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీలకు సమకూరేలా చర్యలు తీసుకుంటున్నాం.

సంక్షిప్త సమాచారం

జడ్పీటీసీ సభ్యుడు బాపిరెడ్డికి నివాళి

కందుకూరు, గుడ్లూరు : మృతి చెందిన జడ్పీటీసీ సభ్యుడు కె.బాపిరెడ్డి మృతదేహానికి పలువురు నివాళి అర్పించారు. మాజీ మంత్రి ఎం.మహీధర్‌రెడ్డి, ప్రకాశం జిల్లా వైకాపా బాధ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, గుడ్లూరు ఎంపీపీ రమేశ్ తదితరులు బాపిరెడ్డి సొంతూరు గుండ్లపాలెం వెళ్లి మృతదేహానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాయకులు జి.వెంకటేశ్వర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచుకోవాలి.. ఉదయగిరి : మండలంలో పనిచేసే సీఆర్‌ఎంటీలు వారి పరిధిలో పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచుకోవాలని ఎంఈవో తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం సీఆర్‌ఎంటీలతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు సిద్ధయ్య, శ్రీనివాసులు, ఇనయతుల్లా, మొహిద్దీన్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ

ఉదయగిరి : స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో సోమవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌కిషోర్ ఆటో కార్మికులతో కలిసి సంఘం జెండా ఆవిష్కరించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో ఆటో స్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పోలీసులకు విన్నవించారు. కార్యక్రమంలో పలువురు ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

ఉదయగిరి : స్థానిక స్త్రీశక్తి భవనంలో మండలంలోని 17 పంచాయతీల ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాసరాజు, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ షేక్ కరిముల్లా సోమవారం శిక్షణ ఇచ్చారు. పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన పలు అంశాలపై సలహాలిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగూర్‌బీ, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

భూముల వివరాలను సరిచేయాలని వినతి.. ఉదయగిరి : భూముల వివరాలను ఆన్‌లైన్‌లో సరిచేయాలని కోరుతూ మండలంలోని బిజ్జంపల్లి గ్రామానికి చెందిన మైనార్టీలు సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య సమస్యను వివరించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి..

దగదర్తి : ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బానాయుడు పేర్కొన్నారు. సోమవారం గ్రీవెన్స్‌లో భాగంగా గ్రామస్థులతో కలసి అధికారులను కలిసి సమస్యలను విన్నవించారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రజలకు భోజన వసతి కల్పించారు.

పేదలకు చేయూత.. కావలి గ్రామీణం : పేదలకు చేయూత ఇవ్వడం అభినందనీయమని హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు ఘనీ బాషా పేర్కొన్నారు. పట్టణ వాసి దివంగత నల్లూరి రామ్మూర్తి 11వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు మధుబాబు, గోపీచంద్ ఆముదాలదిన్నె గిరిజన కాలనీలో పేదలకు దుప్పట్లు, పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స..

కావలి : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి వైద్యుల బృందం అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. సోమవారం రెండో కాన్పు నిమిత్తం వచ్చిన ఓ మహిళ కడుపులో కిలోకు పైగా బరువు ఉన్న కణితి తొలగించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. శస్త్రచికిత్సలో సూపరింటెండెంట్ పద్మావతి, వైద్యులు వెంకటలక్ష్మి, మాధవీలత, భార్గవి, విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

కావలి : అల్లూరు రోడ్డు సమీపంలో రైలు పట్టాలపై 30 ఏళ్ల వ్యక్తి మృతదేహం ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. సోమవారం ఈ విషయాన్ని కావలి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. మృతుడు ఝార్ఖండ్ వాసిగా పోలీసులు భావిస్తున్నారు.

దాడిపై కేసు నమోదు

కావలి, న్యూస్‌టుడే: ఇంట్లోకి చొరబడి దాడి చేశారని పట్టణంలోని కచ్చేరిమిట్టకు చెందిన షేక్ ఆదం అనే మహిళ పోలీసులను ఆశ్రయించారు. తన భర్తతోపాటు ఆయన స్నేహితుడు సంధాని ఇంట్లో ఉండగా రియాజ్ వచ్చి దాడులకు పాల్పడ్డారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెండో పట్టణ ఎస్సై గౌస్‌బాషా తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

ఉలవపాడు : స్థానిక బైపాస్‌లో ఒకరి వద్ద మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇతని వద్ద 50మద్యం సీసాలు దొరికాయన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత : భీమవరం వద్ద మన్నేరు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. ఈ రెండు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించామన్నారు.

వైఎస్ విగ్రహం ధ్వంసం

వరికుంటపాడు : మండలంలోని తోటలచెరువుపల్లె బస్టాండు కూడలిలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సోమవారం మధ్యాహ్నం చేయి విరగ్గొట్టినట్లు వైకాపా నాయకులు గుర్తించారు. పోలీసులకు సైతం ఫిర్యాదు చేస్తామని ఆ పార్టీ నాయకులు తెలిపారు.

తెదేపా, జనసేన వర్గీయుల ఘర్షణ

కావలి, దగదర్తి, న్యూస్‌టుడే : దగదర్తి మండలంలోని తురిమెర్లలో తెదేపా, జనసేన వర్గీయుల మధ్య సోమవారం సాయంత్రం ఘర్షణ జరిగింది. ఇందులో జనసేన వర్గీయులు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలోని అల్లం సునీత, రాధయ్య కుటుంబాల వారు బంధువులు. వీరి మధ్య కొన్నాళ్లుగా మనస్పర్థలు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఉదయం నుంచి సునీత సూటిపోటి మాటలు అంటుంది. ఎందుకు తిడుతున్నావని ఆమె ఇంటి కెళ్లి రాధయ్య ప్రశ్నించారు. ఈసందర్భంగా ఇరు కుటుంబాల వారు దాడులకు పాల్పడ్డారు. ఘర్షణలో సునీతతో పాటు ఆమె అక్క మనుబోటి రాధ, కుమార్తె తాళ్లూరి కల్పన, బంధువు పంకం కార్తిక్ గాయపడ్డారు. వీరిని గ్రామస్థులు కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేస్తున్నారు. బాధితులంతా జనసేన మద్దతుదారులు కావడంతో ఆ పార్టీ కావలి నియోజకవర్గ బాధ్యుడు అళహరి సుధాకర్ ఆసుపత్రికి చేరుకొని పరామర్శించారు. నిందితులు గ్రామంలో తెదేపా వర్గీయులుగా గుర్తింపు పొందారు.

వివాదాస్పద స్థలంలో సిమెంట్ ఒరల తొలగింపు

లింగసముద్రం, న్యూస్‌టుడే: పెదపవనిలోని వివాదాస్పద స్థలంలో గ్రామానికి చెందిన వ్యక్తి ఒరలు దించడం ఉద్రిక్తతలకు దారిరింది. దీంతో కొందరు ఓ సామాజిక వర్గానికి చెందిన వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై మహమ్మద్ సుభానీ వెళ్లి స్థలంలోని ఒరలను తొలగించారు. ఎలాంటి ఘర్షణలు జరకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

కందుకూరు, గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని చేవూరు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుడ్లూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం జాతీయ రహదారి వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కావలికి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. యజమానులపై కేసు నమోదు చేసి అపరాధ రుసుం విధించనున్నట్లు ఎస్సై తెలిపారు.

ఖాళీ స్థలాలు.. మురుగు కూపాలు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన కాలనీల్లో ఖాళీ స్థలాలు మురుగు కూపాలుగా దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి కుంటలుగా తయారవుతున్నాయి. ఖాళీ స్థలాల్లో చేరుతున్న వర్షపు నీరు క్రమంగా మురుగునీరుగా చేరి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు అధికంగా రోగాల బారిన పడుతున్నారు. పట్టణంలోని పలు ప్రధాన కాలనీలను ఈ సమస్య వేధిస్తోంది. సదరు ఖాళీ స్థలాల యజమానులపై మున్సిపల్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంపై పట్టణవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ఇళ్ల మధ్య నీరు నిలిచి దోమల ఉత్పత్తి

వేలాదిగా ఖాళీ స్థలాలు

పట్టణ పరిధి దశాబ్దకాలంగా విస్తరిస్తోంది. పలు ప్రాంతాల్లో అనధికార లేఅవుట్లు వెలిశాయి. గ్రామాల నుంచి పట్టణాలకు ప్రజల వలసలూ పెరిగాయి. దీంతో ఆయా లేఅవుట్లలో నివేశన స్థలాలు కొనుగోలు చేసి ఇంటి నిర్మాణాలు చేస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. అలా ఇళ్ల నిర్మాణాలకు పోను మిగిలిన ఖాళీ స్థలాలు భారీగా ఉన్నాయి. ప్రధానంగా సాయినగర్, ఐఎస్.రావు నగర్, కోవూరురోడ్డు, విక్కిరాలపేటరోడ్డు, కోటారెడ్డినగర్, సంతోష్‌నగర్, వాణీనగర్, బిలాల్‌నగర్, కనిగిరిరోడ్డు, కేసరిగుంటకాలనీ తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు భారీగా ఉన్నాయి. పట్టణంలో మొత్తం సుమారు 4వేల నుంచి 5వేల వరకు ఖాళీ స్థలాలు ఉన్నట్లు అంచనా. వీటిలో 20 శాతం స్థలాలకు కూడా వీఎల్‌టీ(ఖాళీ స్థలం పన్ను) విధిస్తున్న దాఖలాల్లేకపోవడం గమనార్హం. మున్సిపాలిటీకి ఖాళీ స్థలాల ద్వారా ఏడాదికి రూ.6లక్షలు మాత్రమే పన్ను రూపంలో ఆదాయం వస్తున్నట్లు సమాచారం. స్థలాలన్నింటిపై పన్నులు విధిస్తే మున్సిపాలిటీకి భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఇంటి నిర్మాణానికిగానూ ప్లాన్ అనుమతి కోసం వెళ్లినపుడు మాత్రమే మూడేళ్లకు వీఎల్‌టీ విధించి వసూలు చేస్తున్నారు. కోవూరురోడ్డు, సాయినగర్, ఐ.ఎస్.రావు.నగర్, వాణీనగర్, కోటారెడ్డినగర్, సింహాద్రినగర్, విప్పగుంటరోడ్డు ప్రాంతాల్లో ఎన్ఆర్ఐలు, ధనవంతులు స్థలాలు కొనుగోలు చేసి స్థిరాస్తులుగా ఉంచుకుని ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. దీంతో ఆయా స్థలాల గురించి పట్టించుకునే వారు కరవై చిల్లచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి వర్షాకాలంలో మురికి కూపాలుగా నిలుస్తున్నాయి. ఫలితంగా కాలనీవాసులు రోగాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు.

చర్యలు చేపడతాం

మున్సిపాలిటీలో కొన్ని ఖాళీ స్థలాలకు మాత్రమే పన్నులు విధించడం జరిగింది. మిగిలిన ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి త్వరలోనే వారికి నోటీసులు జారీ చేస్తాం. పన్నులు విధించడంతో పాటు సదరు స్థలాల్లో మురుగునీరు నిల్వ లేకుండా యజమానులకు నోటీసులిచ్చి చర్యలు తీసుకుంటాం.

– కె.అనూష, మున్సిపల్ కమిషనర్

అధునాతనమైన పరికరములతో.. ఆధునిక దంత వైద్య సేవలు మరింత చేరువలో...

రాంబాబు సూపర్ స్పెషాలిటీ
దంత వైద్యశాల & ఇంప్లాంట్ సెంటర్

సుందరయ్య భవన్ రోడ్, ఒంగోలు - 523001,
ఫోన్ : 08592 - 227456, 282967



డా|| ముత్తినేని రాంబాబు
B.D.S., (DVG) M.D (Orthodontist, Moscow)
ఎత్తు పళ్ళు, వంకర పళ్ళు సరిచేయు నిపుణులు



డా|| యమ్.ఆశాలత
B.D.S., M.D.S. (Periodontist)
చిగుళ్ళ వ్యాధుల నిపుణురాలు

25th ANNIVERSARY

అత్యున్నతమైన నైపుణ్యం కలిగి
అధునాతన పద్ధతిలో విశిష్ట సేవలను అందిస్తూ

24 వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకొని
25వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా
పేషంట్లకు, బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు, హాస్పిటల్ సిబ్బందికి
హృదయపూర్వక కృతజ్ఞతలు.

(c) eenadu

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు



కర్నూలులో ఛాంపియన్‌గా నిలిచిన షూటింగ్‌బాల్ నెల్లూరు జిల్లా జట్టు

షూటింగ్‌బాల్ ఛాంపియన్‌గా నెల్లూరు

బుచ్చిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: జిల్లా షూటింగ్‌బాల్ బాలికల జట్టు ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నట్లు ఏపీ షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు భీమతాటి వెంకటరమణయ్య తెలిపారు. కర్నూలు జిల్లాలో జరిగిన ఏడో అంతర్‌జిల్లాల జూనియర్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంటులో నెల్లూరు బాలికలు ప్రతిభ కనబరిచారన్నారు. ఫైనల్‌లో కర్నూలు జట్టుపై విజయం సాధించి మొదటి బహుమతి అందుకున్నారని వివరించారు. కోచ్ చక్రి, సురేష్, స్పందనలు బాలికల జట్టుకు ఉత్తమకోచింగ్ అందించారని ప్రశంసించారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు వద్దు

పొదలకూరు, న్యూస్‌టుడే: తమ నివాసాల మధ్య మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు కొందరు సన్నాహాలు చేస్తున్నారంటూ సోమవారం రామనగర్‌కు చెందిన మహిళలు, యువకులు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల సమీపంలో పాఠశాలలు, దేవస్థానాలు ఉన్నాయని ఇలాంటి చోట మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేస్తే మహిళలు, విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటోందన్నారు. గతంలో ఈ ప్రాంతంలో దుకాణం ఏర్పాటు చేసినప్పుడు రాత్రివేళల్లో తాగుబోతులతో ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. అప్పట్లో పలు మార్లు నిరసనలు, ఆందోళనలు చేసి మూయించేశామన్నారు. తిరిగి ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. ఆ మేరకు తహసీల్దారు శివకృష్ణకు వినతి పత్రాన్ని అందజేశారు.



ఆందోళన చేస్తున్న రామనగర్ వాసులు

పనులు గుర్తించి.. ప్రాధాన్యం మరిచి


పాతదేవరాయపల్లిలో పంట కాలువ దుస్థితి

— న్యూస్‌టుడే, అనంతసాగరం —

మండల పరిధిలో పంట కాలువలు అధ్వానంగా ఉన్నాయి. అధికారుల అవగాహనలేమితో ఈ దుస్థితి వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఇటీవల ఉపాధి హామీ పనులకు సంబంధించి గ్రామసభలు నిర్వహించారు. చేయాల్సిన పనులు గుర్తించారు. కానీ ప్రాధాన్యంమరిచి.. ఇతర పనులు చేపడుతుండడంతో పుష్కలంగా సాగునీటి లభ్యత ఉన్నా పంటలకు నీరందడం కష్టతరంగా మారింది.

ప్రస్తుతం సోమశిల జలాశయం నుంచి ఉత్తర కాలువ ద్వారా సాగునీరు సరఫరా అవుతోంది. మండల వ్యాప్తంగా కాలువ పరిధిలో అధికారికంగా 17వేలు ఎకరాలు.. అనధికారికంగా మరో అయిదు వేల ఎకరాలు సాగవుతోంది. ఉత్తర కాలువ 13-ఆర్ తూము ద్వారా ఇనగలూరు, ఆమనిచెరువెళ్ల తదితర ముందున్న గ్రామాలకు మాత్రమే నీరు సరఫరా అవుతుంది. పంటకాలువలు సరిలేకపోవడంతో లింగంగుంట, బెడుసుపల్లి, పాతదేవరాయపల్లి, కచిరదేవరాయపల్లి ఇతర గ్రామాలకు అరకొరగా చేరుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణ కొరవడడంతో..

గత తెదేపా ప్రభుత్వంలో పంట కాలువల పూడికతీత పనుల కోసం ప్రత్యేక నిధులు ఏర్పాటు చేసి శుభ్రం చేశారు. వైకాపా ప్రభుత్వంలో వీటి ఊసే మరిచారు.కాలువలు అధ్వానంగా ఉన్నాయి. తూముగేట్లు తుప్పుపట్టాయి. ఈ తరుణంలోనూ.. ప్రస్తుతానికి ప్రాధాన్యం లేని వరద, అలుగు కాలువల మరమ్మతు పనులను ఉపాధి సిబ్బంది చేపడుతోంది. భారీవర్షాల సమయంలో ఈ కాలువలు పెన్నానదికి నీరు తీసుకువెళ్తుంటాయి. వీటిని బాగుచేయాల్సిన అవసరమున్నా.. ముందుగా సోమశిల జలాలు పొలాలకు అందాలంటే ప్రాధాన్యక్రమంలో పంటకాలువలు బాగుచేయాల్సి ఉంది. ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం చెబుతున్నా.. పట్టించుకునే వారే కరవయ్యారని రైతులు చెబుతున్నారు.

ముళ్లచెట్లతో నిండిపోయాయి
పెంచలయ్య, పాతదేవరాయపల్లి

పాతదేవరాయపల్లి పంట కాలువలు ముళ్ల చెట్లు, జమ్ముతో నిండిపోయి నీరు ముందుకు వెళ్లడం లేదు. ఉపాధిహామీ సిబ్బందికి పలు మార్లు విజ్ఞప్తి చేస్తున్న పట్టించుకోవడం లేదు. రైతులకు అవసరమైన పంట కాలువల మరమ్మతులు వదిలేసి ప్రస్తుతం అవసరం లేని పనులు చేస్తున్నారు.

ఉపాధిహామీ సిబ్బంది చొరవ చూపాలి
రామకృష్ణ, రైతు

ఇటీవల జరిగిన గ్రామసభల్లో ప్రధానంగా పంట కాలువలపై దృష్టి సారించాలని ఉపాధిహామీ సిబ్బందికి విన్నవించాం. చేయాల్సిన పనులు గుర్తించారు. కానీ అధికారుల నుంచి కాలువల మరమ్మతులకు ఎలాంటి ప్రతిపాదనలు అందలేదని చెబుతున్నారు. సమస్య పరిష్కరించేలా చొరవ చూపాలి.

● ఈ విషయమై ఎంపీడీవో మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. రైతుల అభ్యర్థన మేరకు ఉపాధిహామీ కింద పంటకాలువల మరమ్మతుల విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. త్వరలో మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్డీవోను కలిసిన మహిళా నాయకులు


ఆర్డీవోకు అభినందనలు తెలుపుతున్న తెలుగు మహిళ నాయకులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన పావనిని తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, ఇతర మహిళా నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల చేయూత

క్యాన్సర్ బాధితురాలికి రూ.లక్ష ఆర్థికసాయం


చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పొదలకూరు, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 20 ఏళ్ల క్రితం చదువుకున్న తోటి విద్యార్థిని క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకుని సహ విద్యార్థులు ఏకమై ఆర్థికసాయం చేశారు. దేశవిదేశాల్లో స్థిరపడిన వారంతా ఉపాధ్యాయులు, సుభాన్, మహ్మద్ సూచన మేరకు తోటి విద్యార్థిని మాధవికి రూ.లక్ష చెక్కును సోమవారం ఇంటికి వెళ్లి అందజేశారు. పూర్వవిద్యార్థులు సుభాన్, మహ్మద్, రవీంద్రకుమార్ నరేంద్రరెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: పట్టణంలోని శాంతినగర్ మూడో వీధిలో మురుగునీటి కాల్వలను పరిశుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. **–రమేశ్‌రెడ్డి, కోవూరు**
సమాధానం: సిబ్బందిని పంపించి కాల్వలను పరిశుభ్రం చేయిస్తాం. -శివకుమార్, ఈవో, కోవూరు

? పట్టణంలోని పెళ్లకూరు కాలనీలో మురుగునీటి కాల్వలు లేకపోవడంతో వర్షాకాలంలో నీళ్లు ఇళ్లలోకి వస్తున్నాయి. కాలేషా, కోవూరు.
✔ పరిశీలించి.. తగిన చర్యలు తీసుకుంటాం. **–శివకుమార్, ఈవో, కోవూరు**

? అనంతసాగరం మండలంలోని సోమశిల గ్రామం ప్రాజెక్టు కాలనీలో పందుల బెడద ఎక్కువగా ఉంది. **– శ్రీనివాసులురెడ్డి, సోమశిల**
✔ పందులను జనావాసాలకు దూరంగా ఉంచేలా పెంపకందారులకు నోటీసులు జారీ చేస్తాం. **– రమేష్, ఈవోపీఆర్డీ, అనంతసాగరం**

? ఏఎస్‌పేటలో బస్టాండు లేక ప్రయాణికులు రోడ్లపైన, దుకాణాల పంచలందు నిలుచోవలసి వస్తోంది. నూతన బస్టాప్ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. **– రమణమ్మ, ప్రయాణికురాలు**
✔ బస్టాండు ప్రాంతంలో ప్రయాణికులకోసం బస్టాప్ అవసరం ఉంది. అక్కడ నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. **– శ్రీనివాసులు, ఎంపీడీవో**

? విడవలూరు మండలం అన్నారెడ్డిపాలెంలో పోతురాజు గుడి వద్ద చెత్తాచెదారంతో నిండిపోయింది. దుర్వాసన భరించలేకున్నాం. **– రామ్‌ప్రసాద్, అన్నారెడ్డిపాలెం**
✔ పరిశీలించి.. పారిశుద్ధ్య సమస్య పరిష్కరిస్తాం. **– సుజిత, పంచాయతీ కార్యదర్శి**

తెదేపా కార్యాలయం ప్రారంభం

ఆత్మకూరు: ఆత్మకూరులో తెదేపా కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ కేత వేణుగోపాల్‌రెడ్డి, పురపాలక వైస్ ఛైర్మన్ సర్దార్, కౌన్సిలర్లు, నాయకులు చంద్రారెడ్డి, పెంచలచౌదరి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ఆత్మకూరు: తెలుగు నాడు ఆత్మకూరు డివిజన్ విద్యుత్తు ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి డిస్కం అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా ఈశ్వర ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం. కొండయ్య, డివిజన్ సహాధ్యక్షుడిగా సుబ్బారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మలుపులో కష్టాలు తీరేదెన్నడో



ఆదురుపల్లి కూడలిలో మలుపు తిరిగే సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుకాణదారులు సామగ్రి, ఆటోలు, ఆటోలు ద్విచక్ర వాహనాల కారణంగా నెల్లూరు, సోమశిల మార్గాల్లోకి ప్రవేశించటం కష్టంగా మారుతోంది. వాహనాలు ఎక్కువ సమయం దారికి అడ్డంగా నిలిచిపోతున్నాయి. పక్కకు తొలగేందుకు హారన్లు మోగిస్తూ నిరీక్షించాల్సి వస్తోంది. పలుమార్లు ర.భశాఖ అధికారులకు ఈ సమస్య వివరించినా ఎలాంటి చర్యలు లేవని గ్రామస్థులు తెలిపారు. –న్యూస్‌టుడే, చేజర్ల

అల్లుకున్న నిర్లక్ష్యం



విడవలూరు పోలీసుస్టేషన్ ముందు.. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభానికి, వైర్లకు పిచ్చి మొక్కలు తీగలు అల్లుకొని వరదలో ప్రమాదకరంగా ఉంది. ఏమాత్రం అజాగ్రత్త ఉన్నా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఈ విషయమై విద్యుత్తుశాఖ ఏఈ సురేష్‌కుమార్ మాట్లాడుతూ పరిశీలించి.. పిచ్చిమొక్కలను తొలగిస్తామన్నారు.

–న్యూస్‌టుడే, విడవలూరు

చినుకు పడితే మడుగు.. అధికారిని నిగ్గదీసి అడుగు!

పట్టణంలోని కోవూరు-పాటూరు రోడ్డులో శ్మశానవాటిక సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలతో నడిరోడ్డుపై నీటి మడుగులు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వరద బయటకు వెళ్లే మార్గాలను మూసివేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. –న్యూస్‌టుడే, కోవూరు



ఏఎస్‌పేటలో ఛత్తీస్‌గఢ్ వాసుల సందడి



అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేటలోని హజరత్‌ఖాజా నాయబ్ రసూల్ దర్గా సందర్శనకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు రావడంతో సోమవారం సందడి నెలకొంది. దసరా సెలవులు కావడంతో ఆ రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్ పట్టణానికి చెందిన 160 మంది భక్తులు వచ్చారు. ఇక్కడి దర్గా గురించి తెలిసి వచ్చామన్నారు. దర్గా సందర్శించుకున్న తరువాత ప్రశాంతత కలిగిందన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్యాలు చేస్తున్న కళాకారులు

బుచ్చిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: జొన్నవాడ మల్లికార్జున స్వామి కామాక్షి తాయి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శాస్త్రీయ నృత్యాలను భక్తులు తిలకించారు.

వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

బుచ్చిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని ఆ సంఘం నాయకుడు కాలేషా కోరారు. బుచ్చిరెడ్డిపాలెంలో సోమవారం నగర పంచాయతీ కమిషనర్ ఎల్. చంద్రశేఖర్‌రెడ్డికి ఆయన ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు.

మృతుడి ఆచూకీ లభ్యం

కడచూపునకు నోచుకోని కుటుంబ సభ్యులు

మనుబోలు, న్యూస్‌టుడే: భర్త రాక కోసం భార్య, తండ్రి కోసం తనయుడు, తనయుడి రాక కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు ఆవిరయ్యాయి. కడచూపునకు కూడా నోచులేకపోయామని కుటుంబసభ్యులు తల్లడిల్లిపోయారు. ఈ హృదయవిషాదకర ఘటన మనుబోలులో చోటుచేసుకుంది. వివరాల మేరకు గత నెల 28న మండలంలోని వీరంపల్లి అడ్డరోడ్డు సమీపంలో బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. మృతుడి ఆచూకీ సోమవారం లభ్యమైనట్లు ఎస్సై రాకేశ్ తెలిపారు. నెల్లూరులోని ధనలక్ష్మీపురానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మావిళ్ల విష్ణువర్ధన్‌రెడ్డి(31)గా గుర్తించారు. గత నెలలో రాకేశ్ చెన్నై నుంచి నెల్లూరుకు ఆటోలో వెళుతుండగా మార్గం మధ్యలో గుండెపోటుతో మృతిచెందారు. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలలో ఉంచారు. ఆయన ఆచూకీ తెలియకపోవడంతో మున్సిపాలిటీ వారి సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పది రోజుల తర్వాత పలు పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచురితమైన కథనాల ద్వారా భర్త మరణవార్త తెలుసుకున్న భార్య శ్రావ్య మనుబోలు పోలీసులను ఆశ్రయించారు. అనంతరం గూడూరు శ్మశాన వాటికలో తన భర్త సమాధి వద్దకు చేరుకుని చివరి చూపునకు కూడా నోచుకోలేదని కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మనుబోలు, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఎస్సై రాకేశ్ సోమవారం స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండలంలోని కృష్ణపట్నం పోర్టు అడ్డరోడ్డు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా కోట మండలం గూడలి నుంచి వెంకటాచలం మండలం చెముడుగుంటకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఎవరైనా అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంచాయతీ కార్యాలయానికి తాళాలు

పొదలకూరు: స్థానిక పంచాయతీలో జరిగిన పనులకు సంబంధించి దస్త్రాలను తారుమారు చేస్తున్నారని తెదేపా నాయకులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కార్యాలయానికి తాళాలు వేశారు. నాలుగు రోజుల క్రితం పోలీసు స్టేషను సమీపంలోని పంచాయతీ కార్యాలయ భవనంలోకి దస్త్రాలను సర్పంచి, వార్డు సభ్యులు మార్చారు. విషయం తెలుసుకున్న తెదేపా నాయకులు పంచాయతీ రికార్డులు తారుమారు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై హనీఫ్ పంచాయతీ కార్యదర్శి లేకుండా రికార్డులు ఎలా మారుస్తారని ప్రశ్నించారు. ఎవరు జవాబు చెప్పకపోవడంతో కార్యాలయానికి తాళం వేయించి తహసీల్దారుకు అప్పగించారు. ఎంపీడీవో, తహసీల్దారు, పంచాయతీ కార్యదర్శిల సమక్షంలో కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోవాలని ఎస్సై తెలిపారు.

గత తహసీల్దారుపై చర్యలు తీసుకోండి

పొదలకూరు, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో తహసీల్దారుగా పనిచేసి అవినీతి అక్రమాలకు పాల్పడిన వీరవసంతరావుపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం తెదేపా నాయకులు కలెక్టరు ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. మండల పార్టీ అధ్యక్షులు మస్తాన్‌బాబు, కలిచేటి శ్రీనివాసులురెడ్డిలు మాట్లాడుతూ గతంలో జరిగిన భూపంపిణీలో భాగంగా నకిలీ పట్టాలను సృష్టించి పేదలకు పంపిణీ చేశారన్నారు. పేదలకు దక్కాల్సిన భూములు వైకాపా నాయకులతో కలిసి ఇష్టారీతిగా పంపిణీ చేశారన్నారు. విచారణ చేయాలన్నారు. నాయకులు రాధాకృష్ణమ నాయుడు, నరసింహులు, వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహిని.. శక్తి స్వరూపిణి

విడవలూరు, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా విడవలూరులోని అంకమ్మతల్లి గాజుల అలంకరణలో భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. అలగానిపాడులో మహాచండీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. **కోవూరు:** పట్టణంలోని నాగావరపమ్మను రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. **అనంతసాగరం, ఆత్మకూరు, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం:** అనంతసాగరంలో కామాక్షి అమ్మవారు లలితాదేవి గా.. ఆత్మకూరు కన్యకాపరమేశ్వరి.. గజలక్ష్మిగా, పూజలందుకున్నారు. చేజర్ల మండలం బోడిపాడు మహాలక్ష్మి.. గజలక్ష్మిగా, ఏఎస్‌పేట కృష్ణమందిరంలో కన్యకాపరమేశ్వరి.. మోహినీ అవతారంలో దర్శనమిచ్చారు. సంగంలో పాలేటి గంగమ్మ ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. **మనుబోలు, పొదలకూరు:** మనుబోలులోని కోదండ రామపురంలో సరస్వతీదేవిగా పూజలందుకున్నారు. పొదలకూరు మండలం బ్రాహ్మణపల్లిలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. **రాపూరు:** పెంచలకోనలో ఆదిలక్ష్మి.. గజలక్ష్మిగా, పోతుకొండ అంకమ్మ తల్లి ఆలయంలో లలితా త్రిపురసుందరి దేవిగా, రాపూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ.. రాజరాజేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పెంచలకోన మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమంలో హోమాలు నిర్వహించారు. **సైదాపురం, కలువాయి:** సైదాపురంలోని బాల త్రిపుర సుందరీదేవి.. లలితాదేవిగా, కలువాయిలో లలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలో శ్రీకలువాయమ్మ దర్శనమిచ్చారు.


విడవలూరులో గాజుల అలంకరణలో అంకమ్మతల్లి


రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు


కోనలో గజలక్ష్మి అలంకరణలో ఆదిలక్ష్మి


పొదలకూరు: కుంకుమ పూజల్లో మహిళలు


సంగంలో

ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేట మండలపరిషత్తు కార్యాలయంలో ఉపసర్పంచులకు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎంపీడీవో పి.ప్రసన్నకుమారి, శిక్షకులు.. గ్రామపరిపాలన, పారిశుద్ధ్యం, ఆర్థిక నిర్వహణ, పంచాయతీల ఆస్తుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. పంచాయతీల అభివృద్ధికి ప్రతి సభ్యుడు పాటుపడాలని కోరారు.

పద్మశాలీల అభ్యున్నతికి కృషి చేయండి

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు నియోజకవర్గంలోని పద్మశాలీల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని ఆ సంఘ జాతీయ నాయకులు కేవీ శేషయ్య కోరారు. సోమవారం రాష్ట్ర పద్మశాలి ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా విజయవాడలో పదవీ బాధ్యతలు స్వీకరించిన నందం అబద్ధయ్యను ఆయన శాలువాతో సన్మానించారు. నియోజకవర్గంలో పద్మశాలీల సమస్యలు ఆయనకు వివరించినట్లు శేషయ్య తెలిపారు.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

రాపూరులో ఘర్షణ

రాపూరు, న్యూస్‌టుడే: రాపూరులోని ఎస్సీ కాలనీలో రెండు వర్గాల మధ్య నగదు విషయమై ఘర్షణ జరిగింది. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశామని ఎస్సై వెంకటరాజేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చోరీపై ఫిర్యాదు

రాపూరు, న్యూస్‌టుడే: రాపూరు సమీపంలో మద్దెలమడుగు వద్ద ఓ ఇంట్లో ఆదివారం రాత్రి బంగారం చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్సై వెంకటరాజేష్ మాట్లాడుతూ.. స్థానికులు చోరీ జరిగినట్లు తెలిపారని.. ఈ మేరకు బాధితులతో మాట్లాడామన్నారు. వారు అందుబాటులోకి వస్తే.. దర్యాప్తు చేస్తామన్నారు. పూర్తివివరాలు తెలియాల్సి ఉందన్నారు.

కోనలో బుల్లితెర నటి

రాపూరు, న్యూస్‌టుడే: పెంచలకోన ఆలయాన్ని సోమవారం బుల్లితెర నటి శ్రీసత్య సందర్శించారు. పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్లతో పాటు ఆంజనేయస్వామి,గొల్లబోయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గంజాయి గ్యాంగ్‌తో జనం బెంబేలు

● దగదర్తికి చెందిన ఓ కూరగాయల వ్యాపారి కోవూరు మండలంలోని పాటూరు పల్లెపాలెంలో రైతు వద్ద కూరగాయలు కొనేందుకు రాత్రి సమయంలో ద్విచక్రవాహనంపై పాటూరుకు వచ్చారు. అక్కడ కూడలిలో నడిరోడ్డుపై ద్విచక్ర వాహనాలు అడ్డుగా పెట్టిన గంజాయి ముఠా.. ఆ వ్యాపారి జేబులు తనిఖీ చేసి నగదు లేకపోవడంతో దుర్భాషలాడారు. పోలీసులు రావడంతో ముఠా అక్కడ నుంచి పరారయ్యారు. ఈ ముఠా వాడిన ద్విచక్ర వాహనం గ్రామానికి చెందిన ఓ రాజకీయ నాయకుడిది కావడం గమనార్హం.

● పట్టణంలోని రైతులు తమ ఎడ్లబండ్లలో పెన్నానదిలో ఇసుకను తోడుకొని వెంకటేశ్వరపురం నుంచి పడుగుపాడు మీదుగా రైల్వేగేటు దాటి కోవూరు చేరుకుంటారు. ఇటీవల ఆరుగురు సభ్యుల గంజాయి ముఠా పెద్దపడుగుపాడు-వెంకటేశ్వరపురం వంతెన మధ్య ఈ ఎడ్లబండ్లకు అడ్డంగా ద్విచక్రవాహనాలు పెట్టారు. దీంతో రైతులకు గంజాయి ముఠా మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో గంజాయిముఠా కత్తులతో దాడి చేయడంతో పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

● కోవూరు పట్టణంలోని టీఎన్‌సీ కళాశాల వద్ద నడిరోడ్డుపై గంజాయి ముఠా చిల్లర పనులు చేస్తున్నారు. టీఎన్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. దీంతో ఇక్కడకు ప్రతి రోజు 800 మందికి పైగా విద్యార్థులు చదువుకునేందుకు వస్తుంటారు. విద్యా సంస్థల విరామ సమయంలో బాలికలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. గంజాయి ముఠా నడిరోడ్డుపై ద్విచక్రవాహనాలతో హల్‌చల్ చేస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. ఆ తర్వాత ఇబ్బంది పెడతారని స్థానిక వ్యాపారులు భయపడిపోతున్నారు.



న్యూస్‌టుడే, కోవూరు

కోవూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇలాంటి సంఘటనలు నిత్యకృత్యంగా మారాయి. గ్రామానికో గంజాయి గ్యాంగ్ తయారై ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అనారోగ్యంపాలై ఆసుపత్రులకు వెళ్లాలన్నా.. ఎక్కడ రోడ్డుమీద ఈ దండు అడ్డుకుంటుందోనని ప్రజలు వణికిపోతున్నారు. కోవూరు మండలంలోని పాటూరు, పోతిరెడ్డిపాళెం, పడుగుపాడు, ఇనమడుగు, లేగుంటపాడు, వేగూరు, చెర్లోపాళేనికి చెందిన కూరగాయల వ్యాపారులు అర్ధరాత్రి సమయాల్లోనే తమ వాహనాల్లో నెల్లూరు మార్కెట్‌కు కూరగాయలు తరలిస్తుంటారు. కాపుగాసిన గంజాయి ముఠాలు వారిని దారిమధ్యలో అటకాయించి నగదు, ఫోన్లు లాక్కుంటున్నారు. వాటిని తీసుకున్నట్లు పోలీసులకు చెబితే వారిని వదిలిపెట్టేదిలేదని హెచ్చరిస్తుండడంతో.. భయపడి ఎవరూ నోరుమెదపడం లేదు. ఇటీవల కోవూరు పోలీసులు.. ఓ గంజాయిముఠాను అరెస్ట్ చేసి వారి వద్ద 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత చేతులు దులుపుకొన్నారు.

చర్యలు శూన్యం

ఈ దండు సభ్యులంతా యువకులే. పైగా వీరికి గ్రామాల్లోని అధికార, ప్రతిపక్షనాయకుల అండదండలు మెండుగా ఉన్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో పోలీసులు వారిని పట్టుకున్నా తీసుకున్న చర్యలు శూన్యం. ఇప్పటికైనా గంజాయి ముఠాలను కట్టడి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

సమాచారమిస్తే నగదు బహుమతులిస్తాం

రంగనాథ్‌గౌడ్, ఎస్సై, కోవూరు.



కోవూరు మండలంలో గంజాయి ముఠాల ఆచూకీ తెలిపితే వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. అక్రమార్కుల ఆగడాలు కట్టడి చేసేందుకు సహకరించిన వారికి నగదు బహుమతులు(రివార్డులు) ఇస్తాం. మరింత నిఘా పెంచుతాం. గ్రామాల్లో సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయిస్తాం.

అందుబాటులో లేని వరి విత్తనాలు



దుకాణాల్లో కొని వరివిత్తనాలు తీసుకెళ్తున్న వాహనం

సంగం, న్యూస్‌టుడే: తొలి పంటకు అవసరమైన వరివిత్తనాల పంపిణీకి వ్యవసాయ శాఖ ఇంకా శ్రీకారం చుట్టలేదు. దీంతో రైతులు వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. బీపీటీ రకం విత్తనాలు 25 కిలోల బస్తాను రూ.1200 చొప్పున కొనుగోలు చేయడంతోపాటు రవాణా వ్యయం అదనంగా భరించాల్సివస్తోంది. ప్రభుత్వం వెంటనే వాటిని అందించాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయాధికారి శ్రీహరి దృష్టికి తీసుకువెళ్లగా త్వరలో పంపిణీ చేస్తామన్నారు.

ఉపాధి కల్పించాలి

సంగం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని కోరుతూ సంగానికి చెందిన పలువురు మహిళలు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. జాబ్‌కార్డులు అందించాలన్నారు. **చేజర్ల:** గత కొన్ని రోజులుగా చేజర్ల గ్రామంలో నిలిచిపోయిన ఉపాధిహామీ పనులు వెంటనే ప్రారంభించాలని తెదేపా మండల కన్వీనరు రావి లక్ష్మీనరసారెడ్డి ఎంపీడీవోని కోరారు. దీనిపై ఏపీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గ్రామంలో చేపట్టాల్సిన పనులు అంచనాలు వేసి మంజూరు డ్వామా కార్యాలయానికి పంపించామన్నారు.


ఉత్తరక్రియలు

మా నానమ్మ
శ్రీమతి దండిగుంట విజయలక్ష్మి గారు
(W/o Late దండిగుంట స్వామినాయుడు)
తేది 29-09-2024 ఆదివారం స్వర్గస్తులైనారు.
తేది 8-10-2024 మంగళవారం నిలుపు
తేది 9-10-2024 బుధవారం బ్రాహ్మణ బియ్యాలు
ఉ॥ 10.00 గంటలకు నెల్లూరు జిల్లా,
ఇందుకూరుపేట (మం), గంగపట్నం గ్రామంలో
మా స్వగృహము నందు పెద్దకర్మ జరుపబడును.
కావున తెలియజేయడమైనది.

కీ॥శే॥ దండిగుంట విజయలక్ష్మి గారు
మరణం : 29-09-2024

ఇట్లు: దండిగుంట బ్రదర్స్

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

శాశ్వత పరిష్కారం చూపండి


అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ శర్మద

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ శర్మద సూచించారు. సోమవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ అర్జీలకు శాశ్వత పరిష్కారం అందించాలన్నారు. మొత్తం 24 ఫిర్యాదులను స్వీకరించామని నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహన్, ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు త్వరగా పరిష్కరించండి

నెల్లూరు(గ్రామీణం, న్యూస్‌టుడే: వివిధ సమస్యలపై గ్రీవెన్స్‌కు వచ్చి బాధితులు అందించే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని వివిధ విభాగాల అధికార సిబ్బందికి నెల్లూరు ఆర్డీవో నాగసంతోష్ అనూష తెలిపారు. నగరంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పలువురి బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. ● ఆర్డీవోను ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా కమిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి దారా రమణయ్య, డివిజన్ అధ్యక్షుడు ఎన్.నాగేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై చర్చ


ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి పూల మొక్క అందిస్తున్న ఆర్డీవో

నెల్లూరు(గ్రామీణం, న్యూస్‌టుడే: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని నగరంలోని మాగుంట లేఅవుట్ రూరల్ తెదేపా కార్యాలయంలో నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలనాపరమైన పలు విషయాలపై చర్చించారు.

తోడు దూరమై.. సమస్యలు జోడై..

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

భర్తలు కోల్పోయామని కొందరు.. దూరమయ్యారని ఇంకొందరు.. జీవనం భారంగా మారిందని మరికొందరు.. పింఛనే ఆధారమంటూ మహిళలు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. వ్యయప్రయాసలతో వచ్చామని పింఛన్లు మంజూరైతే.. వాటి ఆధారంగా బతుకుతామంటూ అధికారులతో చెప్పి కన్నీటిపర్యంతమయ్యారు.

భర్త, కుమారుడు లేరు

– బోనముక్కల శారదమ్మ, సిరి గార్డెన్స్



భర్త చనిపోయారు. ఉన్న ఒక్క కుమారుడు జగన్ ప్రభుత్వంలో మద్యం తాగి చనిపోయాడు. పోస్టాఫీసులో రూ.6వేలు వచ్చేవి. సీనియర్ సిటీజన్‌ను ట్యాక్స్ పడిందని పింఛను ఇవ్వడం లేదు. మందులకు ఇబ్బందులు పడుతున్నా. ఎటువంటి ఆధారం లేదు. అధికారులు న్యాయం చేయాలి.

తల్లే చేయూత

– దేవల్ల అనిత– వైఎస్సార్‌నగర్, నెల్లూరు



భర్త దేవల్ల గోపి ఏడాదిన్నర క్రితం చనిపోయారు. ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఆరోగ్యం సహకరించడం లేదు. ప్రస్తుతం తల్లి వద్ద ఉంటున్నా. ఎలాంటి ఆధారం లేదు. పిల్లలను పోషించడం కష్టంగా ఉంది. అధికారులు వితంతువు పింఛను అందించి ఆదుకోవాలి.

ఒంటరి జీవనం

– బండి రమణమ్మ– వైఎస్సార్‌నగర్, నెల్లూరు



నా వయస్సు 54 సంవత్సరాలు. భర్త కొన్నేళ్ల క్రితం విడిచి వెళ్లిపోయాడు. కుమారుడు వివాహమై వేరుగా జీవనం సాగిస్తున్నాడు. ఒంటరిగా జీవిస్తున్నా. ఎలాంటి ఆధారం లేదు. కనీసం పింఛను మంజూరు చేస్తే జీవనానికి ఆధారంగా ఉంటుంది.

అంధులం.. ఆదరించండి



– ఎస్‌కే జకావుల్లా, మస్తాన్, డి.కేశవులు, సనావుల్లా, సుమన్, సంతోష్, జిలానీ– అంధులు

అంధులమైన మాకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ పథకాల్లో ప్రథమ అర్హులుగా గుర్తించారు. ఇండిపెండెంట్ రేషన్ కార్డులు, జీవనోపాధికి సబ్సిడీ రుణాలు అందించి ఆదుకోవాలి. ఉచితంగా గృహాలు, శాశ్వత జీవనోపాధి కల్పించాలి. ప్రభుత్వం మంజూరు చేసిన బస్‌పాస్‌లను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలి.

చంద్రబాబుని కలిసిన ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ఇతర కేంద్ర మంత్రులను కలిసేందుకు దిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీని ముఖ్య మంత్రి ఆప్యాయంగా పలకరించారు.

చదరంగం పోటీల్లో ప్రతిభ

నెల్లూరు (క్రీడా విభాగం), న్యూస్‌టుడే: నగరంలోని స్టోన్‌హౌస్‌పేట వివేకానంద జూనియర్ కళాశాలలో రాయ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్-15 ఓపెన్, బాలికల చదరంగం పోటీలు జరిగాయి. పోటీల్లో యజ్ఞేశ్వర్ రెడ్డి, హిమతేజశ్విని బాల బాలికల ఓపెన్ విభాగంలో గెలుపొందారు. బాలుర విభాగంలో ద్వారకానాథ్, యశ్విన్, సుష్మంత్, బాలికల విభాగంలో సుదీక్ష, గీతిక వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాలు సాధించారు. వీరంతా ఈ నెల 15వతేదీ నుంచి గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి చదరంగం ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా చదరంగం సమాఖ్య కార్యదర్శి పి.మస్తాన్ బాబు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్బిటర్లుగా మౌనిక, హరి శీలకులుగా అజీజ్ వ్యవహరించారు.


విజేతలతో నిర్వాహకులు

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: వేదాయపాళెం సావిత్రీనగర్‌లోని రెండో వీధిలో ఎస్‌ఎన్‌బీ/2/4 స్తంభానికి నెల రోజులుగా విద్యుద్దీపం వెలగడం లేదు. – పి.రాధాకృష్ణమూర్తి

? 43వ డివిజన్ శివగిరి కాలనీ 6,7 వీధుల్లో వీధిదీపాలు వెలగడం లేదు. – లక్ష్మి

సమాధానం: విద్యుద్దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. – సూర్యతేజ, కమిషనర్

? వేదాయపాళెం చైతన్యపురి కాలనీలో పట్టపగలే వీధిదీపాలు వెలుగుతున్నాయి. సిబ్బంది వచ్చి ఆర్పడం లేదు. – స్థానికులు

✓ సిబ్బందిని పంపి దీపాలు ఆర్పేలా చేస్తాం. – సూర్యతేజ, కమిషనర్

? బాలాజీనగర్ మసీదు సెంటర్‌లో కాలువలు పూడికతో నిండిపోయి.. దుర్గంధం వస్తోంది. – రషీద్

✓ కాలువల్లో పూడిక తీయిస్తాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? హరనాథపురం రెండు, మూడు వీధుల్లో అడ్డరోడ్లల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. – నాగేశ్వరరావు

? నెల్లూరు నగరంలోని మూలాపేట రాజా గారి వీధి, బెస్తపాలెం, టక్కెమిట్ట ప్రాంతాల పరిధిలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. – స్థానికులు

✓ కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, నవాబుపేట, జడ్పీ)

వైకాపా హయాంలో ఎన్నో కష్టాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: కొండలను మింగిన అనకొండ కాకాణి గోవర్ధన్ రెడ్డి అని తెదేపా ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ ఆరోపించారు. నగరంలోని జిల్లా తెదేపా కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైకాపా హయాంలో అష్టకష్టాలు పడిన ప్రజలు తమ కూటమి ప్రభుత్వంలో ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజలు సంతోషంగా ఉండడం కాకాణికి నచ్చడం లేదన్నారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై గుంతలు

నెల్లూరు నగరం బృందావనంలోని ఎల్ఐసీ కార్యాలయం ప్రాంతంలో ఆరు మాసాల క్రితమే కొత్త సిమెంట్ రోడ్డు నిర్మించారు. ప్రైవేట్ టెలికామ్ కేబుల్ పేరుతో రోడ్డులో గుంతలు తవ్వుతున్నారు. తిరిగి కొత్త రోడ్డు లాగా ప్యాచ్ పనులు చేయడం లేదని స్థానికులు తెలిపారు. ఇలాంటి సంఘటనలు అనేకచోట్ల ఉన్నాయని చెబుతున్నారు. కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు స్పందిస్తూ పర్యవేక్షణ చేస్తామని తెలిపారు.



– న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

శుభ్రం చేయకుంటే ముంపే



నగరంలోని పలు కాలువలు చెత్తతో నిండిపోయాయి. వర్షాలకు ముందుగా శుభ్రం చేయకపోతే ఆ ప్రాంతం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. నగరంలోని ఆర్టీసీ కాలనీకి సమీపంలో ఉన్న ప్రధాన రహదారి వెంబడి కాలువలో చెత్త పేరుకు పోయింది. అధికారులు చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. సమస్య పరిష్కరిస్తామని నగరపాలక ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(బృందావనం)

కుంగిన సిమెంటు రోడ్డు

నెల్లూరు నగరంలోని 44వ డివిజన్ రజక వీధిలో సిమెంటు రోడ్డు కుంగిపోయింది. రోడ్డు మధ్యలో భూగర్భ డ్రైనేజీ పనుల్లో భాగంగా మ్యాన్‌హోల్‌ను ఏర్పాటు చేశారు. సిమెంటు రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకపోవడంతో వర్షాలకు కుంగిపోయింది. రాత్రిపూట గుంత కన్పించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చర్యలు తీసుకుంటామని నగరపాలక అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)



మరమ్మతులకు ఆర్నెల్లా?

నగరంలోని చాకలివీధిలో ఆరు నెలల క్రితం చేతి పంపు మరమ్మతులు గురికాగా.. సిబ్బంది పై భాగం తీసుకెళ్లారు. బిగించడం మరిచిపోయారు. చేతి పంపు తుప్పు పట్టి నిరుపయోగంగా మారింది. మరమ్మతులు చేసేందుకు సిబ్బంది, సామగ్రి ఉన్నా.. నిర్లక్ష్యంగా వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తామని నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.



– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

తరచూ ప్రమాదాలే



నగరంలోని గాంధీనగర్ రోడ్డు చివరన మలుపులో భారీగా గుంతలు పడ్డాయి. వీటివల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు పడి గాయాలపాలవుతున్నారు. రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగరపాలక అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

సంక్షిప్త సమాచారం

బాధ్యతలు స్వీకరించిన పట్టాభి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఏపీ పౌరసరఫరాల శాఖ డైరెక్టర్‌గా జిల్లా తెదేపా సీనియర్ నాయకుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో జరిగిన పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఛైర్మన్ తోట సుధీర్‌బాబు, నారాయణ విద్యాసంస్థలు జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి,తో పాటు పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు. విజయవాడలో మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలను పట్టాభి మర్యాదపూర్వకంగా కలిశారు.

చర్యలు తీసుకోవాలంటూ ధర్నా

నెల్లూరు(కలెక్టరేట్): గుజరాత్ సోమనాథ్‌లో 5 మసీదులు, 45 ముసాఫిర్‌ఖానాలు కూల్చిని స్థానిక కలెక్టర్, ఎస్పీపై చర్యలు తీసుకోవాలని ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్‌జియా ఉల్‌హక్, జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మౌలానా అబ్దుల్ అజీజ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందించారు.

ప్రజా ప్రతినిధుల వినతులు పరిష్కరించండి

నెల్లూరు(కలెక్టరేట్): జిల్లాలో ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చిన వినతులను పరిష్కరించాలని కలెక్టర్ ఒ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చిన వినతులపై తీసుకున్న చర్యలు గురించి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్వో ఎస్.లవన్న, డీపీవో శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు నాగరాజకుమారి, గంగాభవాని, వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, మైక్రో ఇరిగేషన్ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుంటే ఆందోళన

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం వెంటనే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని లేదంటే మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని చంద్రమౌళి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి షేక్ ఖాదర్‌వలి సోమవారం తనిఖీ చేశారు.

ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

నెల్లూరు(గ్రామీణం: నెల్లూరు రూరల్ మండల పరిధిలో పంచాయతీల ఉపసర్పంచులు, ప్రతి పంచాయతీకి సంబంధించి ఇద్దరు వార్డు సభ్యులకు ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ ఆధ్వర్యంలో నగరంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం శిక్షణ తరగతులు జరిగాయి. కార్యక్రమంలో పరిశీలకులు రమేష్, ఎంపీడీవో శైలేంద్ర కుమార్, ఈవో వెంకటరమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడికి యత్నం

నెల్లూరు (నేర విభాగం): పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడికి యత్నించిన ఘటనలో నిందితులపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మూలాపేట హిమాలయ స్కూలు సెంటరుకు చెందిన సుబ్రహ్మణ్యం కొత్తూరు నిర్మలా నగర్‌లో రేషన్ దుకాణం నిర్వహిస్తున్నారు. షాపు విషయంపై ఆయనకు సునీల్ అనే వ్యక్తితో పాతకక్షలు ఉన్నాయి. ఈ నెల అయిదో తేదీ అర్ధరాత్రి సుబ్రహ్మణ్యం తన స్నేహితుడు ప్రదీప్‌తో మాట్లాడుతుండగా సునీల్ తన స్నేహితులైన సద్దాం, హేమంత్‌లతో కలిసి అక్కడకు వచ్చారు. సుబ్రహ్మణ్యంపై కత్తితో దాడి చేసేందుకు యత్నించగా ప్రదీప్ అడ్డుకున్నారు. బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జగన్మాతా నమోస్తుతే

జగన్మాత దర్శనానికి భక్తులు తరలివచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో సోమవారం విశేష అలంకారంలో కొలువుదీరిన అమ్మవార్లను భక్తులు తనివితీరా దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు, ఉభయకర్తల పర్యవేక్షణలో భక్తులకు ఏర్పాట్లు జరిగాయి.

– న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం, దర్గామిట్ట)


ఊరేగుతున్న భువనేశ్వరి


సరస్వతి అలంకారంలో ఇరుకళల పరమేశ్వరి


నరసింహకొండపై సంతానలక్ష్మిగా ఆదిలక్ష్మి


విరాట్‌నగర్‌లో రాజరాజేశ్వరిగా


బాలాజీనగర్‌లో పార్వతి అలంకరణ


వేదాయపాళెంలో ధైర్యలక్ష్మిగా


పప్పులవీధిలో కల్యాణ కాత్యాయినిగా


కాశేశ్వరస్వామి ఆలయంలో శాంతరూపిణిగా


కొత్తూరు వెంకయ్యస్వామి ఆశ్రమంలో అన్నపూర్ణగా


ఫత్తేఖాన్‌పేటలో గజలక్ష్మిగా

న్యాయం చేస్తాం

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చే ప్రతి అర్జీని సత్వరమే పరిష్కరించి న్యాయం చేస్తామని ఎస్పీ జి.కృష్ణకాంత్ హామీ ఇచ్చారు. సోమవారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం 97 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో నెల్లూరుగ్రామీణ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస రావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ● కలువాయి మండలానికి చెందిన రజిత బ్యాంకులో ఉద్యోగం ఇప్పిస్తానని వేదాయపాళానికి చెందిన ఓ మహిళ వద్ద రూ.9లక్షలు, వెంకటాచలానికి చెందిన వ్యక్తి వద్ద రూ.17లక్షలు నగదు తీసుకుని నకిలీ నియామక పత్రాలు అందించారు. విచారించి న్యాయం చేయాలని కోరారు. ● బోగోలు మండలానికి చెందిన ఓ వృద్ధురాలు గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. కొడుకు, కోడలు ఆస్తి కోసం ఆమెను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. వారు వేధింపులు తాళలేకపోతున్నానని విచారించి న్యాయం చేయాలని కోరారు.

దాడి ఘటనపై కేసు నమోదు

నెల్లూరు(నేర విభాగం): మతిస్థిమితం లేని మహిళపై దాడి చేసిన ఘటనలో నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. ఆనం వెంకటరెడ్డి మున్సిపల్ క్వార్టర్స్‌లో షాహినా కుటుంబం నివాసం ఉంటోంది. ఆమెకు వరుసకు పెద్దమ్మ హసీనాకు మతిస్థిమితం సరిగా లేదు. దీంతో పాటుగా ఆమెకు సొంత ఇల్లు కూడా లేకపోవడంతో అప్పుడప్పుడు షాహినా వద్దకు వచ్చి వెళ్తుండేది. గత నెల 27వతేదీ తెల్లవారు జామున హసీనా అదే వీధిలోని ఓ అరుగు మీద కూర్చొని ఉండగా, పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంతానికిచెందిన సాయిచంద్ అటుగా వెళ్తుండగా ఆమె అతనిని దుర్భాషలాడింది. దీంతో యువకుడు ఆమెపై దాడి చేసి గాయపరిచాడు. షాహినా సోమవారం చిన్నబజారు పోలసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిస్సాన్ మ్యాగ్నెట్ కారు ఆవిష్కరణ


కారును ఆవిష్కరిస్తున్న ఎండీ జగన్నాథరెడ్డి

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: నిస్సాన్ మ్యాగ్నెట్ కారు అత్యాధునిక సౌకర్యాలతో కలిగి ఉందని హైటెక్ నిస్సాన్ షోరూం ఎండీ జగన్నాథరెడ్డి తెలిపారు. సోమవారం మినీ బైపాస్ రోడ్డులోని హైటెక్ నిస్సాన్ షోరూంలో నిస్సాన్ సరికొత్త మ్యాగ్నెట్‌కారును ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సి.నిరంజన్, భారతి, హోషిమారెడ్డి, జనరల్ మేనేజర్ ఎన్‌వీఎస్ శాస్త్రి, మేనేజర్ పి.గోపి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ, మత్స్య ఉత్పత్తులు ప్రోత్సహించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సేంద్రియ, మత్స్య ఉత్పత్తులను ప్రోత్సహించాలని మేయర్ స్రవంతి అన్నారు. స్థానిక వీఆర్ కళాశాల మైదానంలో జరుగుతున్న 3వ ఆర్గానిక్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌కు సోమవారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ సభ్యులు, మత్స్యకార సంక్షేమ సమితి అధ్యక్షుడు కె.పోలయ్య తదితర సమితి నాయకులు పాల్గొన్నారు.

అయినా ముందుకే..



నెల్లూరు కొండాయపాలెం గేటు వద్ద సోమవారం కనిపించిన ఈ లారీ. . హరిత గెస్ట్ హౌస్‌కి గూడ్స్‌ని తీసుకువస్తున్న సమయంలో ఎక్కడో ప్రమాదానికి గురైంది. లారీ ముందువైపున సగానికి పైగా దెబ్బతినింది. అందులో ఉన్న వస్తువులు దింపడాని వచ్చిన సమయంలో ఇలా కనిపించింది. –ఈనాడు నెల్లూరు

హోంగార్డుకు పరామర్శ

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డు అనిల్‌ను నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్ బాషా సోమవారం పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ నెల 6న నవాబుపేట పీఎస్‌లో విధులు నిర్వహిస్తుండగా గుండె పోటుకు గురయ్యారు.

తెరపై ఈనాడు

ఎం–1 సినిమాస్– స్క్రీన్1.. స్క్రీన్-2.. దేవర, స్క్రీన్3.. స్వాగ్, స్పైస్‌సినిమాస్(ఎంజీబీ మాల్)– స్క్రీన్1.. స్వాగ్, స్క్రీన్2.. దక్షిణ, సత్యం సుందరం, స్క్రీన్3.. కల్కి, జోకర్(ఇంగ్లీష్), స్క్రీన్4.. స్క్రీన్5.. దేవర, రెయిన్‌సినిమాస్-స్క్రీన్1.. దేవర, స్క్రీన్2.. స్వాగ్, దేవర, స్క్రీన్3.. సత్యం సుందరం, జోకర్(ఇంగ్లీష్), స్క్రీన్4.. బహిర్భూమి, దక్షిణ, కల్కి, సిరిమల్టీప్లెక్స్.. స్క్రీన్1.. దేవర, స్క్రీన్2.. స్వాగ్, స్క్రీన్3.. సత్యం సుందరం

ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి తీరుపై ఆగ్రహం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: సొంత గ్రామంలో మెజారిటీ తెచ్చుకోలేని ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి తెదేపా, జనసేనలపై విమర్శలు చేయడం తగదని పలువురు కార్పొరేటర్లు, తెదేపా నాయకులు అన్నారు. నగరంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో కార్పొరేటర్లు పిండి సురేష్, అశోక్‌నాయుడు, మూలె విజయభాస్కర్‌రెడ్డి, జాన నాగరాజుగౌడ్, పడిగినేటి రామ్మోహన్ యాదవ్, సుధాకర్, శ్రీనివాసులురెడ్డి, తెదేపా నాయకులు పాలకీర్తి రవి, దారా వంశీ, బెల్లంకొండ పెంచలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ ప్రయాణం ప్రమాదమే

న్యూస్‌టుడే, నెల్లూరు(దర్గామిట్ట)

నెల్లూరు నగరంలో చిన్నిచిన్న సమస్యల పరిష్కారంలో ఏళ్ల తరబడి జాప్యం జరుగుతోంది. నెల్లూరు నగర, గ్రామీణ పరిధిలోని పలుచోట్ల జలవనరులశాఖ కాలువల గోడలు కూలిపోయాయి. మూడేళ్ల క్రితం నుంచి ఇదే పరిస్థితి ఉన్నా.. పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. గతంలో కాలువలను నగర పాలక సంస్థ పరిధిలోకి తీసుకొచ్చారు. వీటి పర్యవేక్షణ ఏశాఖది బాధ్యత అనే విషయంపై నేటికీ స్పష్టత లేదు. పూడిక పనులు చేయించే సమయంలో తప్ప.. మిగతా సమస్యలపై శ్రద్ధ చూపడం లేదు.

● మూలాపేట పరిధిలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం సమీపంలో వరుసగా ఉన్న రెండు కాలువలపై ఎలాంటి గోడలు లేవు.. పాత కార్పొరేషన్ కార్యాలయ రహదారి సమీపంలో మూలాపేట శివగిరి కాలనీ వద్ద కాలువపై వంతెన ఉండగా.. ఒక వైపు రక్షణ గోడ రెండేళ్ల క్రితమే కూలింది. స్థానిక నాయకులు, ప్రజలు కలిసి వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. అధికారులు రక్షణ గోడ నిర్మించలేదు. టక్కెమిట్ట ప్రధాన రోడ్డులోని కాలువకు ఇరువైపులా గోడలు లేవు. నెల్లూరు చెరువు గేటు కూడలి వద్ద కాలువపై రక్షణ గోడలు చిన్నవిగా ఉన్నాయి. డైకస్ రోడ్డు కూడలి, బారకాస్, ఆకుతోట తదితర ప్రాంతాలలో సరిగా లేవు.

● ఈ విషయంపై కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు స్పందిస్తూ జలవనరులశాఖ అధికారులతో చర్చించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు.


ఉమామహేశ్వర స్వామి ఆలయం ఎదుట రక్షణ గోడ లేని కాలువ

హత్య కేసులో భార్య అరెస్టు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: కుమారుడిని కాపాడుకునే క్రమంలో భర్తను హత్య చేసిన ఘటనలో భార్యను చిన్నబజారు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మెక్లిన్స్ రోడ్డులో సుభాని(48), కౌసర్ బేగం దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి మువాజ్, సోను, ఇలియాస్ కుమారులు ఉన్నారు. ఈ నెల 8వ తేదీ అర్ధరాత్రి సుభాని పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడ్డారు. అడ్డువచ్చిన పెద్ద కుమారుడు మువాజ్‌పై రోకలి బండతో దాడికి యత్నించారు. భార్య అడ్డుపడి బలవంతంగా రోకలి బండను లాక్కొంది. వంటింటి నుంచి కత్తి తీసుకువచ్చి కుమారుడిని పొడిచేందుకు యత్నిస్తుండగా భార్య భర్త తలపై రోకలి బండతో బలంగా మోదింది. ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని చిన్న కుమారుడు ఇలియాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. సోమవారం కౌసర్ బేగంను ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు అరెస్టు చేశారు.

ఆశా వర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: అక్రమంగా తొలగించిన రావులపల్లి ఆశా వర్కర్ పందిటి విజయమ్మను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీ ప్రసాద్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మస్తాన్‌బీ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న రిలే దీక్షలు సోమవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

(c) eenadu